



PRGI NO: TGTEL/25/A5314

# అర్జున్ సమాచారం

www.arjunsamaachaaram.in

తెలుగు దినపత్రిక

ఎడిటర్ : లింగం రాజయ్య

బ్యూరో చీఫ్ : గిరవెన రాకేష్








నల్లగొండ | హైదరాబాద్ | రంగారెడ్డి | epaper.arjun saamaacharam.com | శుక్రవారం 19, జూన్ 2026 | సంపుటి :1 సంచిక : 172 | పేజీలు : 8 , వెల.2.00


## ఉద్ధవ్ సేన పార్టీ
# ఎంపీలకు విప్ జారీ




2 లో..


మహారాష్ట్రలో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. ఉద్ధవ్ సేనలో చీలిక తప్పదన్న వార్తల నడుమ పార్టీ నాయకత్వం తాజాగా ఎంపీలకు త్రీ లైన్ విప్ జారీ చేసింది. ఢిల్లీలో నేడు జరగనున్న పార్లమెంటరీ పార్టీ సమావేశానికి ఎంపీలు హాజరు కావాలని నిర్దేశించింది. 'పార్లమెంటరీ పార్టీ సమావేశాన్ని ఏర్పాటు చేశాము. విప్ జారీ చేశాము. ఈ విషయంలో లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాకు కూడా లేఖ రాశాము.



## రైతు భరోసా నిధుల
# విడుదలకు ముహూర్తం ఫిక్స్

### వరుసగా తొమ్మిది రోజుల పాటు నిధుల జమ
### కేబినెట్ భేటీలో సీఎం రేవంత్ రెడ్డి


2 లో..


జూన్ 30వ తేదీన రైతు భరోసా నిధులు విడుదల చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. గురువారం సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశమైంది. ఈ సమావేశంలో ఈ మేరకు కేబినెట్ నిర్ణయం తీసుకుంది. వరుసగా తొమ్మిది రోజుల పాటు రైతుల ఖాతాల్లో ఈ భరోసా నిధులను ప్రభుత్వం జమ చేయనుంది. జూన్ 30వ తేదీన ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మధిరలో నిర్వహించే సభలో ఈ రైతు భరోసా నిధులను సీఎం రేవంత్ రెడ్డి విడుదల చేయనున్నారు.





## డీఎంకేకు మరో షాక్.! టీవీకే వైపు ఎండీఎంకే.?

తమిళనాడు రాజకీయాల్లో మరో కొత్త అంశం తెరపైకి వచ్చింది. డీఎంకేకు చిరకాల మిత్రపక్షమైన మరుమలార్చి ద్రవిడ మున్నేట్ర కళగం(ఎండీఎంకే) అధికార తమిళగ వెట్రి కళగం(టీవీకే)తో జట్టుకట్టనుందా? అనే చర్చ ఆ రాష్ట్ర రాజకీయాల్లో జోరందుకుంది. ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైకో.. సీఎం జోసెఫ్ విజయ్‌తో భేటీ కావడం ఈ ఊహాగానాలకు బలం చేకూరుస్తోంది.


2


## జులై 1 నుంచి 11
# శాతం ఫిట్‌మెంట్..

### ఆర్టీసీ ఉద్యోగులకు పొన్నం ప్రభాకర్ శుభవార్త




2


తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు మంత్రి పొన్నం ప్రభాకర్ శుభవార్త చెప్పారు. ఆర్టీసీ సమ్మెలో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులకు జులై 1 నుంచి 11 శాతం ఫిట్‌మెంట్ అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ఆదేశాలు జారీ చేశారు. ఈరోజు(గురువారం) టీజీఎస్‌ఆర్టీసీ ఉన్నతాధికారులతో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ.. నాగర్ కర్నూల్, పెద్దపల్లి బస్ డిపో పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.

## ఆనాడు నా మదిలో పుట్టిన ఆలోచనకు ఆచరణే
# నేటి వనమహోత్సవం: సీఎం రేవంత్ రెడ్డి




2


రంగారెడ్డి జిల్లా గుర్రంగూడ ఎకో పార్కులో వనమహోత్స వం కార్యాక్రమా నికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టబోతు న్నారు. ఈ సందర్భంగా వనమహోత్స వం ప్రాధాన్యాన్ని రేవంత్ రెడ్డి సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా తెలియజేశారు. మొక్కవోని పట్టుదలతో గత విధ్వంస సంఘటనల చెప్పుకొచ్చారు.




2


## టీఎంసీకి కోల్‌కతా హైకోర్టు షాక్.. రితబ్రత నియామకంపై స్టేకు నిరాకరణ

తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) అధినేత్రి మమతా బెనర్జీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా తిరుగుబాటుచేసిన ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీ నియామకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై కోల్‌కతా హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులిచ్చేందుకు నిరాకరించింది.

## మాస్కోపై ఉక్రెయిన్ డ్రోన్ దాడి.. విమాన సర్వీసులకు అంతరాయం

ఇంటర్నెట్ డెస్క్:



రష్యా–ఉక్రెయిన్ యుద్ధం మరింత ఉధృతమవుతోంది. ఉక్రెయిన్ గురువారం వందలాది డ్రోన్లతో మాస్కోపై భారీ దాడి చేసింది. మాస్కోలోని కీలక చమురు శుద్ధి కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకుంది. ఈ దాడి కారణంగా మాస్కోలోని ప్రధాన విమానాశ్రయాలు మూతపడ్డాయి. విమాన రాకపోకలు నిలిచిపోయాయి. .మాస్కోలోని కపోట్న్యా ఆయిల్ రిఫైనరీపై ఉక్రెయిన్ వందలాది డ్రోన్లతో దాడి చేసింది. దాడి అనంతరం భారీ మంటలు చెలరేగాయి. నల్లటి పొగ నగరమంతా వ్యాపించింది. ఇది వారం వ్యవధిలో కపోట్న్యా రిఫైనరీపై జరిగిన రెండో దాడి కావడం గమనార్హం. దాడి నేపథ్యంలో మాస్కోలోని షెరెమెత్యేవో, వ్నుకోవో, జూకోవ్‌స్కీ సహా పలువురు అంతర్జాతీయ విమానాశ్రయాలను మూసివేశారు. వందలాది విమానాలు నిలిచిపోవడంతో, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు

## 'ఈ-క్యాబినెట్' నిర్వహణకు
# మంత్రివర్గం ఆమోదం


2




రాష్ట్ర మంత్రివర్గ సమావేశాలను ఇక నుంచి 'ఈ–క్యాబినెట్' విధానంలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే తెలంగాణ డిజిటల్ కేబినెట్ నిర్వహణకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులకు మంత్రి శ్రీధర్ బాబు స్పెషల్ ట్యాబ్‌లను అందజేశారు. అమలు తీరును పరిశీలించారు. అందుబాటులో ఉంటాయి.




2


## హైదరాబాద్ లో ఆంధ్రా కళాకారుల విగ్రహాలు ఎందుకు?:

# రైతు భరోసా నిధుల విడుదలకు ముహూర్తం ఫిక్స్

## వరుసగా తొమ్మిది రోజుల పాటు నిధుల జమ కేబినెట్ భేటీలో సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాదా అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

జూన్ 30వ తేదీన రైతు భరోసా నిధులు విడుదల చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. గురువారం సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశమైంది. ఈ సమావేశంలో ఈ మేరకు కేబినెట్ నిర్ణయం తీసుకుంది. వరుసగా తొమ్మిది రోజుల పాటు రైతుల ఖాతాల్లో ఈ భరోసా నిధులను ప్రభుత్వం జమ చేయనుంది. జూన్ 30వ తేదీన ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మధిరలో నిర్వహించే సభలో ఈ రైతు భరోసా నిధులను సీఎం రేవంత్ రెడ్డి విడుదల చేయనున్నారు. రైతు భరోసా కింద రైతులకు ఏడాదికి ఎకరానికి రూ.12 వేల ఆర్థిక సహాయం అందిస్తోంది. ఈ పెట్టుబడి సాయాన్ని రెండు పంటల కాలాలకు (ఖరీఫ్, రబీ) విడగొట్టి, ప్రతి సీజన్‌కు ఎకరాకు రూ. 6,000 చొప్పున నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు.మరో వైపు 23వ ప్రధాన మంత్రి కిసాన్ యోజన పథకం కింద నిధులను కేంద్రం జూన్ 20వ తేదీన విడుదల చేయనుంది. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లాలోని తారకేశ్వర్‌లో జరిగే కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ నిధులను విడుదల చేయనున్నారు. దాంతో ఒక్కో రైతు ఖాతాలో రూ. 2 వేలు చొప్పున నగదు జమ కానుంది. దీంతో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు 10 రోజుల తేడాతో రైతుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నాయి.

## ఉద్ధవ్ సేన పార్టీ ఎంపీలకు విప్ జారీ

ఇంటర్నెట్ డెస్క్: అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

మహారాష్ట్రలో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. ఉద్ధవ్ సేనలో చీలిక తప్పదన్న వార్తల నడుమ పార్టీ నాయకత్వం తాజాగా ఎంపీలకు త్రీ లైన్ విప్ జారీ చేసింది. ఢిల్లీలో నేడు జరగనున్న పార్లమెంటరీ పార్టీ సమావేశానికి ఎంపీలు హాజరు కావాలని నిర్దేశించింది. 'పార్లమెంటరీ పార్టీ సమావేశాన్ని ఏర్పాటు చేశాము. విప్ జారీ చేశాము. ఈ విషయంలో లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాకు కూడా లేఖ రాశాము. ఎంపీల మధ్య చీలికలు తేవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని స్పష్టం చేశాము' అని పార్టీ ఎంపీ సంజయ్ రౌత్ తెలిపారు.జాతీయ మీడియా కథనాల ప్రకారం, పార్టీకి చెందిన మొత్తం ఎంపీల్లో మూడింట రెండు వంతుల మంది మద్దతు కూడగట్టేందుకు రెబల్ వర్గం ప్రయత్నాలు చేస్తోంది. పూర్తి మద్దతు ఖరారయ్యాక లోక్‌సభ స్పీకర్‌ను కలవనున్నట్టు తెలుస్తోంది. 'ఇందుకు ఒక ప్రొసీజర్ ఉంటుంది. ప్రధాన పార్టీ నుంచి తప్పుకుని ప్రత్యేక బ్లాక్‌గా ఏర్పడే ఎంపీలు అందరూ తమ సంతకాలతో కూడిన లేఖను స్పీకర్‌కు సమర్పించాల్సి ఉంటుంది. ఇవన్నీ రికార్డు అవుతాయి. ప్రధాన పార్టీ అభిప్రాయాలను కూడా స్పీకర్ ఈ సందర్భంగా స్వీకరిస్తారు' అని సంబంధిత వర్గాలు తెలిపాయి.

## డీఎంకేకు మరో షాక్.! టీవీకే వైపు ఎండీఎంకే.?

ఇంటర్నెట్ డెస్క్: అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

తమిళనాడు రాజకీయాల్లో మరో కొత్త అంశం తెరపైకి వచ్చింది. డీఎంకేకు చిరకాల మిత్రపక్షమైన మరుమలార్చి ద్రవిడ మున్నేట్ర కళగం(ఎండీఎంకే) అధికార తమిళగ వెట్రి కళగం(టీవీకే)తో జట్టుకట్టనుందా? అనే చర్చ ఆ రాష్ట్ర రాజకీయాల్లో జోరందుకుంది. ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైకో.. సీఎం జోసెఫ్ విజయ్‌తో భేటీ కావడం ఈ ఊహాగానాలకు బలం చేకూరుస్తోంది. కాగా.. ఇటీవలే వైకో కుమారుడు, ఎండీఎంకే ఎంపీ దుర్రై వైకో కూడా విజయ్‌తో సమావేశమైన సంగతి తెలిసిందే.కాగా.. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే నేతృత్వంలోని కూటమిలో ఎండీఎంకే పోటీచేసి రెండు స్థానాలను కైవసం చేసుకుంది. ఆ పార్టీ సాధారణ మండలి సమావేశం ఈ నెలాఖరులో జరగనుంది. పార్టీ భవిష్యత్తు రాజకీయ దిశగా ఆ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకునే అవకాశమున్నట్టు తెలుస్తోంది. అయితే.. టీవీకే నేతృత్వంలోని మైనారిటీ ప్రభుత్వంపై జరిగిన విశ్వాస పరీక్షలో ఎండీఎంకే తటస్థంగా వ్యవహరించింది. డీఎంకేతో కలిసి పనిచేసిన పలువురు మాజీ మిత్రపక్షాలు ఇప్పటికే టీవీకే ప్రభుత్వానికి మద్దతిస్తున్నాయి. కాంగ్రెస్, వీసీకే, ఐయూఎంఎల్ పార్టీలు అధికార వ్యవస్థలో భాగస్వాములయ్యాయి. మరోవైపు సీపీఐ, సీపీఎం పార్టీలు విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వానికి బయట నుంచే మద్దతు తెలుపుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎండీఎంకే వైఖరి మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.అయితే.. ఈ ఊహాగానాలపై వైకో అప్రమత్తంగా వ్యవహస్తున్నట్టు తెలుస్తోంది. పార్టీ భవిష్యత్తు రాజకీయ నిర్ణయాలను సాధారణ మండలి ఆధ్వర్యంలోనే తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. సీఎం విజయ్‌తో సమావేశం పూర్తిగా ప్రజా సమస్యలపైనే జరిగిందని పేర్కొన్నారు. తూత్తుకుడిలో వేదాంత గ్రూప్‌నకు అనుబంధంగా మరో రాగి పరిశ్రమ ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. అలాంటి ప్రాజెక్టుకు అనుమతి ఇవ్వొద్దని కోరానని వెల్లడించారు.

## టీఎంసీకి కోల్‌కతా హైకోర్టు షాక్.. రితబ్రత నియామకంపై స్టేకు నిరాకరణ

ఇంటర్నెట్ డెస్క్: అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) అధినేత్రి మమతా బెనర్జీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా తిరుగుబాటుచేసిన ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీ నియామకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై కోల్‌కతా హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులిచ్చేందుకు నిరాకరించింది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ కృష్ణారావు నేతృత్వంలోని ధర్మాసనం.. తదుపరి విచారణ జరిపేంత వరకు స్పీకర్ నిర్ణయం అమలులో ఉంటుందని స్పష్టం చేసింది.ఈ పిటిషన్ తదుపరి విచారణకు ముందే అఫిడవిట్ల మార్పిడిని పూర్తి చేయాలని ఇరు పక్షాలను ఆదేశించింది న్యాయస్థానం. ప్రతివాదులు మూడు వారాల్లోగా తమ వ్యతిరేక అఫిడవిట్‌ను దాఖలు చేయాలని, దానిపై మరో పక్షం వారు రెండు వారాల్లోగా స్పందించాలని గడువు విధించింది. ఈ విషయంపై తదుపరి విచారణ జులై 28కి వాయిదా వేసింది. దీంతో ఈ కేసు ఫలితం వెలువడే వరకు రితబ్రత బెనర్జీ గుర్తింపు పొందిన ప్రతిపక్ష నేతగా కొనసాగనున్నారు.కాగా.. టీఎంసీ నుంచి బహిష్కృతమైన రితబ్రత బెనర్జీ.. ఆ పార్టీకి వ్యతిరేకంగా తిరుగుబాటు ఎమ్మెల్యేలకు న్యాయకత్వం వహిస్తున్నారు. దీంతో బెంగాల్ రాజకీయ సంక్షోభంలో వివాదం రాజుకుంది. తమకు 58 మంది టీఎంసీ ఎమ్మెల్యేల మద్దతుందని పేర్కొంటూ, ఆమె మేనల్లుడైన అభిషేక్ బెనర్జీకి వ్యతిరేకంగా ఓ చీలిక వర్గాన్ని ఏర్పాటు చేశారు రితబ్రత. అయితే.. తిరుగుబాటు వర్గం వాదనను అంగీకరిస్తూ రితబ్రతను ప్రతిపక్ష నాయకుడిగా ఆ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ రతీంద్ర బోస్ నియమించడంతో ఈ వివాదం మరింత ముదిరింది. స్పీకర్ నిర్ణయం అధికారికంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీని పక్కనపెట్టిందని, శాసనసభ పార్టీల గుర్తింపును నియంత్రించే రాజ్యాంగ నిబంధనల్ని ఉల్లంఘించిందని వాదిస్తూ.. దీదీ వర్గం కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే.

## జులై 1 నుంచి 11 శాతం ఫిట్‌మెంట్..

### ఆర్టీసీ ఉద్యోగులకు పొన్నం ప్రభాకర్ శుభవార్త

హైదరాబాద్, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు మంత్రి పొన్నం ప్రభాకర్ శుభవార్త చెప్పారు. ఆర్టీసీ సమ్మెలో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులకు జులై 1 నుంచి 11 శాతం ఫిట్‌మెంట్ అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ఆదేశాలు జారీ చేశారు. ఈరోజు(గురువారం) టీజీఎస్ఆర్టీసీ ఉన్నతాధికారులతో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ.. నాగర్ కర్నూల్, పెద్దపల్లి బస్ డిపో పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. వేములవాడ, కథలాపూర్ బస్ స్టేషన్లకు త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు.హుజూర్‌నగర్, కోదాడ, నాగర్‌కర్నూల్ బస్ స్టేషన్లకు కూడా మంత్రి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ములుగు బస్ స్టేషన్ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. మహాలక్ష్మీ పథకంపై ప్రత్యేక అధ్యయనం చేయాలని సూచించారు. మహిళా సంఘాలకు చెందిన 553 బస్సుల పనితీరుపై మంత్రి నివేదిక కోరారు. రాష్ట్రంలో 1,050 ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణపై సమగ్ర నివేదిక అందించాలని ఆదేశించారు. ఆర్టీసీ వద్ద 10,173 బస్సులు.. 38,128 మంది ఉద్యోగులు ఉన్నారని, రోజుకు 61 లక్షల మంది ప్రయాణికులు టీజీఎస్ఆర్టీసీ సేవలు పొందుతున్నట్లు తెలిపారు.పెండింగ్ కారుణ్య నియామకాలను వెంటనే పూర్తి చేయాలని అధికారులను పొన్నం ఆదేశించారు. తొలగించిన ఉద్యోగుల్లో 244 మందికి ఇప్పటికే విధుల్లోకి అవకాశం ఇచ్చినట్లు తెలిపారు. ఉద్యోగి శంకర్ కుటుంబానికి రూ.1 కోటి చెక్కును ఆర్టీసీ అందజేయనున్నట్లు తెలిపారు. శంకర్ కుటుంబంలో ఒకరికి ఉద్యోగంతో పాటు, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసినట్లు చెప్పారు. దక్షిణ భారత రవాణా శాఖ మంత్రులతో త్వరలో ప్రత్యేక సమావేశం జరగనుందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## ఆనాడు నా మదిలో పుట్టిన ఆలోచనకు ఆచరణే నేటి వనమహోత్సవం: సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

రంగారెడ్డి జిల్లా గుర్రంగూడ ఎకో పార్కులో వనమహోత్సవం కార్యాక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టబోతున్నారు. ఈ సందర్భంగా వనమహోత్సవం ప్రాధాన్యాన్ని రేవంత్ రెడ్డి సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా తెలియజేశారు. మొక్కవోని పట్టుదలతో గత విధ్వంస సంఘటనల జ్ఞాపకాల నుంచి తీసుకున్న సంకల్పానికి ఫలితమని చెప్పుకొచ్చారు.

**పర్యావరణహితంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దే యజ్ఞం: రేవంత్ రెడ్డి**

'ఈరోజు గుర్రంగూడలో ప్రారంభించే వనమహోత్సవానికి ఒక ప్రాధాన్యం ఉంది. ఇది కేవలం మొక్కుబడి కార్యక్రమం కాదు. 'మొక్క'వోని పట్టుదలతో నిన్నటి విధ్వంస సంఘటనల జ్ఞాపకాల నుంచి తీసుకున్న సంకల్పానికి ఫలితం. చెరువుల కబ్జా, అటవీ భూములపై పంజా.. ఫలితంగా చినుకు పడితే హైదరాబాద్ అతలాకుతలం... ఇదీ గత పాలనా దృశ్యం. చెరువుల పరిరక్షణ, నాలాల పునరుద్ధరణ, అటవీ భూములపై న్యాయస్థానాల్లో కొట్లాడి విజయం సాధించి, పర్యావరణహిత నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దే యజ్ఞం.. ఇది నేటి పాలన దృశ్యం. 2021లో ఇదే గుర్రంగూడలో వరదల సమయంలో మల్కాజ్‌గిరి ఎంపీగా పర్యటించినప్పుడు నా మదిలో కలిగిన ఆవేదన నుంచి పుట్టిన ఆలోచనకు ఆచరణ ఈనాటి గుర్రంగూడ అటవీ భూమిలో జరిగే వనమహోత్సవం. ప్రజాప్రభుత్వం బాధ్యతలు స్వీకరించిన అనంతరం కబ్జాదారులపై న్యాయపోరాటం చేసి, అటవీ భూములను రక్షించి, నగరాన్ని వనంలో జనం జీవించే ప్రాంతంగా తీర్చిదిద్దే మా ప్రయత్నానికి ఈరోజు నిర్వహించే గుర్రంగూడ వనమహోత్సవం ఒక ఉదాహరణ' అంటూ ఎక్స్‌లో రేవంత్ రెడ్డి పోస్ట్ చేశారు.

## 'ఈ-క్యాబినెట్' నిర్వహణకు మంత్రివర్గం ఆమోదం

హైదరాబాద్,

: రాష్ట్ర మంత్రివర్గ సమావేశాలను ఇక నుంచి 'ఈ-క్యాబినెట్' విధానంలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే తెలంగాణ డిజిటల్ కేబినెట్ నిర్వహణకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులకు మంత్రి శ్రీధర్ బాబు స్పెషల్ ట్యాబ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిజిటల్ కేబినెట్ అమలు తీరును పరిశీలించారు.ఈ క్యాబినెట్ విధానంతో మంత్రివర్గ ఎజెండాలు, నోట్‌లు, నిర్ణయాలు, ఫైళ్లు పూర్తిగా డిజిటల్ రూపంలో అందుబాటులో ఉంటాయి. వాటిని సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు ట్యాబ్, కంప్యూటర్ ద్వారా చూసుకునేందుకు అవకాశం ఉంటుంది. అదే సమయంలో క్యాబినెట్ నిర్ణయాలు, ఎజెండాలను ఎక్కడి నుంచైనా, ఏ సమయంలోనైనా చూసుకోవచ్చు. ఇందుకోసం మంత్రివర్గ సభ్యులకు ప్రత్యేక పాస్‌వర్డ్, లాగిన్ ఐడీని అందిస్తారు.దీంతో పత్రాల భద్రత, గోప్యత మరింత పెరుగుతుంది. 'ఈ-క్యాబినెట్' విధానం కోసం ప్రభుత్వం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను వినియోగించనుంది. ఈ సాఫ్ట్‌వేర్ కోసం దాదాపు రూ.2కోట్ల వరకు ఖర్చవుతుందని రాష్ట్ర ఐటీ శాఖ అంచనావేసింది. ఇందులో భాగంగానే ఎన్‌ఐసీకి మొదటి విడతగా రూ.20లక్షలు చెల్లించేందుకు ప్రభుత్వం అనుమతినిచ్చినట్టు తెలుస్తోంది.

## హైదరాబాద్ లో ఆంధ్రా కళాకారుల విగ్రహాలు ఎందుకు?: కవిత

హైదరాబాద్: తెలంగాణ మీద ఇంకా ఆంధ్రుల పెత్తనమే నడుస్తోందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత ఆరోపించారు. గద్దర్ కు సినిమా రంగానికి సంబంధం లేదని అన్నారు. ఎపి సిఎం డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ పై కవిత విమర్శలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. ఆంధ్రా కళాకారుల విగ్రహాలు హైదరాబాద్ లో ఎందుకు? అని సెక్రటరేరియట్ ముందు దివంగత ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ విగ్రహం ఎందుకు? అని కవిత ప్రశ్నించారు. కాంగ్రెస్ కు చిత్తశుద్ధి ఉంటే పవన్ కల్యాణ్ మీద దేశ ద్రోహం కేసు పెట్టాలని డిమాండ్ చేశారు. పవన్ కల్యాణ్ కు తలకాయ లేదని, వేర్పాటు వాదం అంటూ తెలంగాణను అవమానిస్తున్నారని కవిత మండిపడ్డారు.

## ఒడిశాలో తెలంగాణ ఈగల్ ఫోర్స్ భారీ ఆపరేషన్




హైదరాబాద్: అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

గంజాయి సరఫరా చేస్తున్న ముఠాలపై తెలంగాణ ఈగల్ ఫోర్స్ ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించింది. ఈ ఆపరేషన్‌లో 500 కెజిల గంజాయిని స్వాధీనం చేసుకుంది. రాష్ట్రంలో దొరికిన ముఠాల లింక్ ఆధారంగా ఒడిశా వెళ్లిన ఈగల్ ఫోర్స్ టీమ్.. బిలిమెల నుంచి జయపూర్ వరకు 80 కిలోమీటర్లు వెంబడించి గంజాయి తరలిస్తున్న వాహనాన్ని పట్టుకుంది. పోలీసులు వెంబడించడంతో బొలెరో వాహనాన్న వదిలేస పారిపోయాడు. వాహనంలో వివిధ ప్యాకెట్లుగా ఉన్న 500 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాహనం ఒడిశాలోని గాంధీనగర్ వాసి అమీర్ అలీఖాన్ పేరుతో ఉన్నట్లు గుర్తించారు.

## రైతులను ఇబ్బందులకు గురిచేసేలా ప్రభుత్వం వ్యవహరిస్తోంది: జీవన్ రెడ్డి

హైదరాబాద్:



ధాన్యం తరుగు పేరిట కాంగ్రెస్ వెయ్యికోట్లు దోచుకున్నారని బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి టి. జీవన్ రెడ్డి ఆరోపించారు. ఎల్ నినో ప్రభావం ఉందని ఒకవైపు చెప్తున్నారు.. కానీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేవలం 7 రకాల వెరైటీలను మాత్రమే సాగు చేయాలని ప్రభుత్వం చెబుతుందని, దిగుబడి లేని పంటను సాగు చేయాలని రైతులను ఒత్తిడి తెస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం చెప్తున్న 7 రకాల వెరైటీలు కేవలం 20 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని, రైతులకు లాభసాటి అయ్యేలా ప్రభుత్వం చూడాలని జీవన్ రెడ్డి సూచించారు.

# నిడమర్రు రైల్వే ఓవర్ బ్రిడ్జికి శంకుస్థాపన

## పెమ్మసానితో కలసి పూజ చేసిన లోకేశ్

### రూ.142 కోట్ల వ్యయంతో ఆర్వోబీ నిర్మాణం

**గుంటూరు**

నిడమర్రు రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణానికి కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తో కలిసి మంత్రి నారా లోకేష్ బుధవారం శంకుస్థాపన చేశారు. నంబూరు-మంగళగిరి సెక్షన్ మార్గంలో మంగళగిరి-నిడమర్రు మార్గంలో 14వ నెంబర్ రైల్వే లెవల్ క్రాసింగ్ గేటు స్థానంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణ పనులకు ఈ ఉదయం మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ముందుగా మంగళగిరి-నిడమర్రు రోడ్డు వద్దకు చేరుకున్న మంత్రి లోకేష్, ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ లకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఘనస్వాగతం పలికారు. మంగళగిరి నుంచి రాజధాని అమరావతికి, తాడికొండ నియోజకవర్గానికి అనుసంధానంగా నిడమర్రు రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద రూ.142 కోట్ల వ్యయంతో ఆర్వోబీని నిర్మించనున్నారు. దశాబ్దాలుగా ఈ మార్గంలో రైల్వే లెవల్ క్రాసింగ్ వల్ల ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీంతో మంత్రి లోకేష్ చొరవ తీసుకుని రైల్వే లెవల్ క్రాసింగ్ పై ఆర్వోబీ నిర్మాణానికి ప్రభుత్వం నుంచి అనుమతి మంజూరు చేయించారు. సమస్య శాశ్వత పరిష్కారంగా రైల్వే ఓవర్ బ్రిడ్జి మంజూరుకు కృషిచేశారు. ఆర్వోబీ నిర్మాణం పూర్తయితే నిడమర్రు, మంగళగిరి, తాడికొండ, అమరావతి ప్రాంతాల మధ్య రాకపోకలు సులభతరం అవుతాయి. ప్రజా రాజధాని అమరావతికి సులభమైన, నిరంతరాయ రవాణ అనుసంధానాన్ని కల్పిస్తుంది. మంగళగిరి, అమరావతి మధ్య ప్రయాణ దూరం తగ్గుతుంది. మంగళగిరి పట్టణం నుంచి మంగళగిరి నియోజకవర్గంలోని బేతపూడి, నిడమర్రు, కురగల్లు, నీరుకొండ గ్రామాల ప్రజలకు ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుంది. భవిష్యత్ లో ఈ ప్రాంతంలో పట్టణీకరణ, ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుంది. రైల్వే క్రాసింగ్ గేటు ద్వారా రోజుకు సుమారు 60 రైళ్లు ప్రయాణిస్తాయి. రోజుకు రహదారి రాకపోకల కోసం గేటు మూసివేసే సగటు వ్యవధి 8 నుంచి 10 గంటలుగా ఉంది. లెవల్ క్రాసింగ్ గేటు మూసివేసిన సమయంలో ప్రయాణీకులు దాటేందుకు 10 నుంచి 15 నిమిషాల సమయం పట్టేది. ఆర్వోబీ నిర్మాణంతో సుమారు నిమిషంలోనే దాటే అవకాశం ఉంది. నిడమర్రు రైల్వే లెవల్ క్రాసింగ్ పై ఆర్వోబీ రైల్వే లైన్ పై 10 మీటర్ల ఎత్తులో నిర్మించనున్నారు. దీని పొడవు 767.50 మీటర్లు. ఇందులో రైల్వే లైన్ నుంచి అమరావతి వైపు 362 మీటర్లు, మంగళగిరి వైపు 405.50 మీటర్లు నిర్మాణం చేపట్టనున్నారు. వంతెనపై నాలుగు లైన్లు రహదారి ఏర్పాటుచేయనున్నారు. ప్రతి లైను 3.75 మీటర్లు కాగా మొత్తం క్యారేజ్ వే వెడల్పు 15 మీటర్లు ఉంటుంది. అదనంగా 0.45 మీటర్లు చొప్పున రెండు వైపులా క్రాష్ బ్యారియర్లు, 0.45 మీటర్లు మధ్య డివైడర్ నిర్మించనున్నారు. సర్వీసు రోడ్లు డ్రైన్లతో కలిపి రెండు వైపులా 11 మీటర్లు 5.5 మీటర్ల వెడల్పుతో ఏర్పాటుచేయనున్నారు. సర్వీస్ రోడ్లతో సహా ఆర్వోబీ మొత్తం వెడల్పు 28 మీటర్లు ఉండనుంది. ఈ కార్యక్రమంలో పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు గుత్తికొండ ధనుంజయ్, మంగళగిరి నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ, టీడీపీ గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, మంగళగిరి పట్టణ టీడీపీ అధ్యక్షుడు పడవల మహేష్, మండల పార్టీ అధ్యక్షుడు పల్లబోతుల శ్రీనివాసరావు, స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ డైరెక్టర్ ఆరుద్ర భూలక్ష్మి, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## ఇంద్రకీలాద్రిపై సామూహిక అక్షరాభ్యాసం

### భారీగా తరలివచ్చిన చిన్నారులు, తల్లిదండ్రులు

**విజయవాడ,**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మ ఆలయంలో సామూహిక అక్షరాభ్యాస మహోత్సవం వైభవంగా నిర్వహించారు. నిజ జేష్ఠ తదియ సందర్భంగా ఈ మహోత్సవాన్ని ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం 6 గంటలకే మహా మండపం 6వ అంతస్తుకు భారీ ఎత్తున ఐదు సంవత్సరాలలోపు చిన్నారులు, వారి తల్లిదండ్రులు చేరుకున్నారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి మాత్రమే ప్రవేశాన్ని కల్పిస్తున్నారు. చిన్నారితో పాటు తల్లిదండ్రులకు మాత్రమే అమ్మవారి దర్శనానికి అనుమతి ఇవ్వనున్నారు. ఉదయం 8:06 గంటలకు శుభ ముహూర్తంలో అక్షరాభ్యాసం ప్రారంభమైంది. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య అత్యంత వైభవోపేతంగా అక్షరాభ్యాస కార్యక్రమం మొదలైంది. పలక, బలపం, పూజా సామాగ్రిని ఆలయ అధికారులు ఉచితంగా అందజేస్తున్నారు. అక్షరాభ్యాసం అనంతరం అమ్మవారి దర్శనం, ప్రసాదాలు ఉచితంగా ఇవ్వనున్నారు. సామూహిక అక్షరాభ్యాస మహోత్సవం సందర్భంగా సమయపాలన పాటించాలని భక్తులకు ఈవో శీనా నాయక్ విజ్ఞప్తి చేశారు.

## డిఎస్సీపై దమ్ముంటే చర్చకు రావాలి

### ఆరోపణలు కాదు..ఆధారాలు చూపాలి

### జగన్‌కు మంత్రి లోకేశ్ సవాల్

**గుంటూరు,**

వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ఏపీ మంత్రి నారా లోకేశ్ సవాల్ విసిరారు. డీఎస్సీపై తాడేపల్లి ప్యాలెస్‌కు కూతవేటు దూరంలో ఉండి మరీ ఛాలెంజ్ చేశారు మంత్రి. 'జగన్ ఇంటికి 200 మీటర్ల దూరంలో నిలబడే మాట్లాడుతున్నా.. డీఎస్సీపై అనుమానాలుంటే సమాధానం చెప్పేందుకు ఇక్కడే సిద్ధంగా ఉన్నా. సవాల్ స్వీకరించే ధైర్యం ఉన్నవాళ్లు చర్చకు రావాలి. జగన్ ఎన్ని జన్మలెత్తినా డీఎస్సీ నియామకాలు ఆపలేరు. మేం సాక్షి క్యాలెండర్ కాకుండా నిజమైన జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తున్నాం. ఒక్క డీఎస్సీ అయినా నిర్వహించి ఉంటే హారిజాంటల్, వర్టికల్ రిజర్వేషన్లు అర్థమవుతాయి' అంటూ వ్యాఖ్యానించారు. పులివెందుల ఎమ్మెల్యే.. బెంగళూరు, హైదరాబాద్ వీడి ఏపీ వైపు చూస్తే అభివృద్ధి కనిపిస్తుందని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ప్రిజనరీ చుట్టూ ఎప్పుడూ రౌడీలే ఉంటారని మంత్రి అన్నారు. మహిళల్ని కించపరిచే వారిని, తిట్టేవారిని తన చుట్టూ ప్రిజనరీ పెట్టుకుంటారంటూ దుయ్యబట్టారు. కోడిగుడ్డుకు పరిశ్రమకు తేడా తెలియని వాళ్లు మంత్రులుగా చేయబట్టే పరిశ్రమలు పారిపోయాయంటూ మండిపడ్డారు. గుడివాడ అమర్‌నాథ్ అద్భుతంగా మాట్లాడారని జగన్ కితాబివ్వటం దురదృష్టకరమన్నారు. భారతీరెడ్డి, తన ఇద్దరు కూతుళ్లని.. హోం మంత్రిని అవమానించినట్లు అవమానిస్తే కూడా జగన్ శభాశ్ అంటారా అని ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీది ఆ సంస్కృతి కాదు కాబట్టే జగన్ కుటుంబసభ్యుల్ని కించపరిచిన వారిపైనా చర్యలు తీసుకున్నామని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

## ద్విచక్రవాహనం ప్రమాదంతో ఇద్దరికి గాయాలు

### అటువైపు వచ్చిన మంత్రి అనిత సహాయక చర్యలు

**అనకాపల్లి,**

ఏపీ హోం మంత్రి వంగలపూడి అనిత మానవత్వం చాటుకున్నారు. ఎలమంచిలి సమీపంలో ద్విచక్ర వాహనం ప్రమాదానికి గురికావడంతో ఓ యువతి, యువకుడు తీవ్రంగా గాయపడ్డారు. రోడ్డుపై గాయాలతో బాధపడుతున్న వారిని చూసిన హోంమంత్రి అనిత చలించిపోయారు. వెంటనే అక్కడకు చేరుకుని గాయాలైన వారికి సపర్యలు చేశారు. అంబులెన్స్‌ను ఏర్పాటు చేసి సమీపంలోని ఆసుపత్రికి తరలించేలా చర్యలు తీసుకున్నారు. రోడ్డు ప్రమాద బాధితులను చూసి చలించిపోయిన హోం మంత్రి.. వారికి సపర్యలు చేయడంతో పాటు వెంటనే ఆస్పత్రికి తరలించేలా చర్యలు తీసుకున్నారు. రెండేళ్ల ఎన్డీయే పాలన విజయోత్సవ సభలో పాల్గొనేందుకు బుధవారం ఉదయం నక్కపల్లిలోని తన నివాసం నుంచి అనకాపల్లికి అనిత బయలుదేరారు. మార్గమధ్యంలో ఎలమంచిలి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదాన్ని చూసి వెంటనే తన కాన్వాయ్‌ను ఆపించి బాధితులకు సహాయం అందించారు. గాయపడిన వారికి ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం వైద్యులతో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి అనిత.. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాద బాధితుల పట్ల హోంమంత్రి అనిత చూపిన చొరవ, మానవత్వంపై స్థానికులు ప్రశంసలు కురిపిస్తున్నారు.

## దసరా నాటికి ఇంటిగ్రేటెడ్ టెర్మినల్

### విమానాశ్రయ పనులు పరిశీలించిన శ్రీనివాసవర్మ

**విజ.యవాడ,**

: గన్నవరం విమానాశ్రయంలో నూతన టెర్మినల్ నిర్మాణ పనులను కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ బుధవారం ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దసరా నాటికి ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. రాష్ట్రం నడిబొడ్డున ఉన్న విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని దేశానికే తలమానికంగా అభివృద్ధి చేసి చూపిస్తామని భూపతిరాజు శ్రీనివాసవర్మ స్పష్టం చేశారు. అభివృద్ధి, ప్రజా సంక్షేమమే కూటమి లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ నేతృత్వంలో దేశం అన్ని రంగాల్లో వృద్ధి చెందుతోందన్నారు. దేశంలో మౌలిక సదుపాయాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పుకొచ్చారు.



ప్రజలకు రోడ్డు, రైలు, విమాన, నౌక రవాణా.. కార్గో సేవలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఏపీలో 8500 కిలోమీటర్ల జాతీయ రహదారిని ఎన్డీయే హయాంలో విస్తరించామని కేంద్ర మంత్రి వెల్లడించారు. విమాన సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అంతర్జాతీయ ప్రమాణాల కన్నా ఎక్కువ నాణ్యతగల విమానాశ్రయాలను అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. ఉడాన్ పథకంతో దేశంలోని చిన్నా, మధ్యతరహా విమానాశ్రయాలను పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఈ పథకంతో విమాన సౌకర్యం ప్రజలకు తక్కువ ఖర్చుతో అందుబాటులోకి రానుందన్నారు. సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విమానాశ్రయ డిజైనింగ్‌పై ప్రత్యేక శ్రద్ధ కనబర్చారన్నారు.

## విద్యుత్ తీగలకు అడ్డంగా చెట్లు

### కొమ్మలు నరుకుతుండగా షాక్‌తో కూలీ మృతి

**హైదరాబాద్,**

నగరంలోని అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎంఈఎస్ కాలనీలో ఒక విషాదకర సంఘటన చోటుచేసుకుంది. ఒక అపార్ట్‌మెంట్ ముందున్న చెట్టు కొమ్మలను నరుకుతున్న సమయంలో ఒక దినసరి కూలీ ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. కరెంట్ సరఫరా అవుతున్న తీగలు తగలడంతో సూర్యనారాయణ (45) అనే ఆ కూలీ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మృతుడు సూర్యనారాయణ రోజువారీ కూలీ పనులు చేస్తూ తన కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఆయన మరణంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. సూర్యనారాయణకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఇంటిని నడిపించే పెద్ద దిక్కును కోల్పోవడంతో ఆ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఘటనపై సమాచారం అందుకున్న అల్వాల్ పోలీసులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు.

## కొత్తగూడెం ప్రభుత్వాసుపత్రిలో దారుణం

### నర్స్ కాన్పు చేయడంతో తల్లీబిడ్డా మృతి

**భద్రాద్రి కొత్తగూడెం,**

: జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో దారుణం జరిగింది. వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఓ నర్సు కాన్పు చేసింది. కానీ ప్రసవం అనంతరం తల్లీబిడ్డ మృతిచెందారు. వివరాల్లోకి వెళ్తే.. గుండాల మండలం శంభునిగూడెం గ్రామానికి చెందిన గర్భిణి వనజ (20)కు పురిటినొప్పులు రావడంతో గుండాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే ఆ సమయంలో ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో లేరు. దీంతో అక్కడ ఉన్న నర్స్ సాధారణ ప్రసవం చేసింది. కానీ కాన్పు తర్వాత శిశువు అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ఇది గమనించిన కుటుంబసభ్యులు ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నవజాత శిశువును పరీక్షించిన వైద్యులు అప్పటికే మరణించినట్లుగా తెలిపారు. మరోవైపు కాన్పు అనంతరం తల్లికి తీవ్ర రక్తస్రావం కావడంతో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో చికిత్స పొందుతూ ఆమె కూడా మరణించింది. ఈ ఘటనపై బాధిత కుటుంబం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తమ కుమార్తె, మనమడు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## తుని జ్ఞానేశ్వరి అదృశ్యం బాధాకరం

### కుటుంబ సభ్యులకు మంత్రి అనిత ఓదార్పు

### ఆచూకీ కోసం కృషి చేస్తున్నామని వెల్లడి

**కాకినాడ,**

తునిలో అదృశ్యమైన రెండేళ్ల చిన్నారి జ్ఞానేశ్వరి కుటుంబసభ్యులను హోం మంత్రి వంగలపూడి అనిత పరామర్శించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ.. రెండేళ్ల చిన్నారి అదృశ్యమవడం చాలా బాధాకరమన్నారు. పాప కనిపించకపోవడంతో తల్లడిల్లుతున్న జ్ఞానేశ్వరి తల్లిబాధ వర్ణణాతీతమని అన్నారు. పాప మిస్సయిన విషయం తెలుసుకొన్న వెంటనే పోలీసులు అప్రమత్తమై గాలింపు చర్యలు చేపట్టారని తెలిపారు. టెక్నికల్‌కు సంబంధించిన ఆధారాలే కాకుండా గ్రౌండ్ లెవెల్‌లో వివిధ బృందాలు జల్లెడ పడుతున్నాయని చెప్పారు. పాప మిస్సింగ్ విషయంలో ప్రభుత్వం ఎక్కడా అలసత్వం వహించలేదని హోం మంత్రి స్పష్టం చేశారు. ప్రతిరోజు ఈ అంశం మీద మోనిటరింగ్ చేస్తున్నామన్నారు. పాప ఆచూకీ దొరికే వరకూ గాలింపు చర్యలు కొనసాగుతాయన్నారు. జ్ఞానేశ్వరి కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా భరోసాగా ఉంటుందని అన్నారు. సోషల్ మీడియా, కొన్ని యూట్యూబ్ ఛానళ్లలో అసత్య ప్రచారం జరుగుతోందన్నారు. తక్షణమే అలాంటి అసత్య ప్రచారాలను నిలిపివేయాలని.. లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హోం మంత్రి అనిత హెచ్చరించారు.

## వరంగల్ పర్యటనలో పవన్ కళ్యాణ్

### అభిమాని చిన్నారి నిరంజన్‌కు పరామర్శ

### వైద్యం కోసం లక్ష రూపాయాల ఆర్థికసాయం

### భద్రకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు

**వరంగల్**

ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న అభిమాని నిరంజన్ (17)ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పరామర్శించారు. బుధవారం హనుమకొండ, హనుమాన్ నగర్‌లోని బాలుడి ఇంటికి వెళ్లారు. బాలుడితో కొద్దిసేపు ముచ్చటించారు. నిరంజన్ కుటుంబానికి పవన్ భరోసా ఇచ్చారు. నిరంజన్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం లక్ష ఆర్థిక సాయం అందించారు. చిన్ననాటి నుంచి మీరంటే ప్రాణం అని చెప్పిన నిరంజన్ మాటలకు పవన్ చలించి పోయారు. నిరంజన్‌ను హత్తుకుని ముద్దాడారు. తను ఆరోగ్యంగా ఉన్న సమయంలో పవన్ పాటలకు వేసిన డాన్స్‌ల వీడియోలను నిరంజన్.. పవన్‌కు చూపించారు. తిరుమల నుంచి తెప్పించిన వస్త్రాన్ని నిరంజన్‌కు అందించారు. భద్రకాళి ఆలయంలో పూజ చేయించిన అమ్మవారి వెండి ప్రతిమను నిరంజన్ తల్లిదండ్రులకు అందజేశారు. ఇక, పవన్ పర్యటన నేపథ్యంలో అభిమానులు పెద్ద సంఖ్యలో బాలుడి ఇంటి దగ్గరికి చేరుకున్నారు. కాగా, నిరంజన్‌కు చిన్నప్పటి నుంచి పవన్ అంటే ప్రత్యేక అభిమానం. ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న అతడు తన అభిమాన హీరో పవన్ కల్యాణ్‌ను కలవాలన్న కోరికను కుటుంబసభ్యులతో వెలిబుచ్చాడు. ఈ విషయం పవన్ వరకు వెళ్లింది. ఆయన తన అభిమాని కోసం హనుమకొండకు వచ్చారు. అనారోగ్యంతో బాధపడుతున్న తన అభిమానిని కలిశారు. అతడికి చెప్పలేనంత సంతోషాన్ని అందించారు. జన్యుపరమైన వ్యాధితో బాధపడుతున్న నిరంజన్ అనే బాలుడు తనకు అభిమాని అని, తనను కలవాలన్న అతడి ఆకాంక్షను తెలుసుకున్న పవన్.. ఉదయం నేరుగా బాలుడి నివాసానికి వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. తన పర్యటనకు సంబంధించిన ఫొటోలతో 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. కొద్ది రోజుల క్రితం వరంగల్ జిల్లా హనుమకొండకు చెందిన నిరంజన్ అనే యువకుడు అరుదైన వ్యాధితో పోరాడుతూ నన్ను కలవాలనే ఆకాంక్షను వ్యక్తం చేసిన వీడియోను చూశాను. నిరంజన్ ఆకాంక్షను నెరవేర్చాలని భావించాను. ఈరోజు హనుమకొండలోని అతని నివాసానికి వెళ్లి పరామర్శించాను. అరుదైన వ్యాధితో చేస్తున్న పోరాటంలో అతడి అసాధారణ ధైర్యం, ఆత్మవిశ్వాసం, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న తీరు స్ఫూర్తిదాయకం. తీవ్రమైన అనారోగ్య సమస్యల మధ్య నిరంజన్ చూపుతున్న మనోధైర్యం ప్రశంసనీయం. నిరంజన్ సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ఆ కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరస్వామిని ప్రార్థించాను. భద్రకాళి అమ్మవారి ఆశీస్సులు అతనిపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నాను. భగవంతుని ఆశీస్సులతో నిరంజన్ త్వరగా కోలుకోవాలి. ప్రియమైన నిరంజన్.. నీ ధైర్యం నీ కష్టాలకంటే గొప్పది. త్వరలో నిన్ను సంపూర్ణ ఆరోగ్యంతో, చిరునవ్వుతో, మరింత ఉత్సాహంగా చూడాలని కోరుకుంటున్నాను అని పేర్కొన్నారు. అదే సమయంలో వరంగల్, హనుమకొండ పర్యటనకు పూర్తి సహాయ సహకారాలు అందించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ శాఖకు కృతజ్ఞతలు. తెలంగాణ ప్రజలు నాపై చూపిస్తున్న ప్రేమ, ఆప్యాయత, అభిమానానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు. తెలంగాణ ప్రజల ఆశీర్వాదాలు, ప్రేమ నాకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తాయి. నాపై మీ మమకారాన్ని జీవితాంతం నా హృదయాంతరాల్లో నిలుపుకొంటాను' అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిరంజన్ ఓ కుక్క పిల్ల బొమ్మ చూపించి దాన్ని పెంచుకోవాలని ఉందని చెప్పగా, కొని పంపుతానని పవన్ హామీ ఇచ్చారు. కుక్కను పెంచుకోవడానికి ఇంటి ఓనర్స్ అనుమతి కావాలని నిరంజన్ తండ్రి చెప్పగా, స్వయంగా ఆ ఇంటి ఓనర్స్‌ని పిలిపించి మాట్లాడారు. నిరంజన్ తల్లిదండ్రులు వృత్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో కాకతీయ ఆసుపత్రి క్యాంటిన్‌లో పని చేసేవాళ్లమని చెప్పగా, వారి జీవనోపాధి మెరుగుపర్చేందుకు క్యాంటిన్ పెట్టించాలని జనసేన తెలంగాణ రాష్ట్ర నేతలకు సూచించారు. నిరంజన్ పరామర్శ పూర్తయిన వెంటనే పవన్ వరంగల్ భద్రకాళి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆయన వెంట జనసేన నేతలు శంకర్ గౌడ్, శ్రీరామ్ తాళ్లూరి, రాధారం రాజలింగం, ఆర్ కె సాగర్ తదితరులు ఉన్నారు.



PRGI NO: TGTEL/25/A5314
అర్జున్ సమాచారం
www.arjunsamaachaaram.in
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం...

# శాంతి సుమాలు విరబూయాలి

**ఇదిగో శాంతి, అదిగో శాంతి అంటూ గత కొన్ని రోజులుగా ఇరాన్‌తో ఒప్పందంపై పూటకో మాట, రోజుకో ప్రకటన చేస్తూ వచ్చిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మొత్తానికి బతిమాలి, బెదిరించి, ఒకింత ఆగ్రహించి ఇరాన్‌ను దారికి తీసుకురాగలిగారు. అయితే, ఈ ఒప్పందం నమ్మదగినదేనా అంటే.. ఏమో చెప్పలేం. శాంతి ఒప్పందం కుదిరిన వెంటనే అభినందనలతో ముంచెత్తిన అనేక ప్రపంచ దేశాలదీ ఇదే పరిస్థితి. అంతెందుకు, అమెరికాతో ఒప్పందానికి సరేనన్న ఇరాన్ సైతం అమెరికా అధ్యక్షుడి మాటలకు విశ్వసనీయత లేదని, చివరివరకూ ఆయన మాటలను నమ్మలేమని ముక్తాయించడం గమనార్హం. అందుకే కాబోలు, ఒప్పందాన్ని అమలు చేసే బాధ్యత పూర్తిగా అమెరికాదేనంటూ తను చేతులు దులుపుకుంది. మూడున్నర నెలలుగా సాగుతున్న యుద్ధానికి తెరపడిందన్న ఆనందం ఎంతకాలం నిలుస్తుందో ఇప్పటికిప్పుడే ఎవరూ చెప్పలేని పరిస్థితి.**

తాత్కాలిక కాల్పుల విరమణ అమలులో ఉన్న సమయంలోనూ ఇరాన్‌పై పలుమార్లు దాడులకు తెగబడిన ఘన చరిత్ర అమెరికా, ఇజ్రాయెల్ లది. ప్రపంచ దేశాలపై పెద్దన్న పెత్తనం చెలాయించే అమెరికా మాటంటే నిన్నమొన్నటి వరకూ అనేక దేశాలకు వేదవాక్కు. స్వీయ ప్రయోజనాలకోసం పాకులాడినా, అది చాపకింద నీరులా తెలిసీ తెలియనట్లు ఉండేది. కానీ, ట్రంప్ మహాశయుడు రెండోసారి పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత అమెరికా పరువు నడిబజారుకు ఎక్కింది. ఎప్పుడు ఏం మాట్లాడతారో, ఎప్పుడు ఏ వైఖరి అవలంబిస్తారో ఆయనకే తెలియదు. కాబట్టి, శాంతి ఒప్పందం కుదిరిందంటున్నా నమ్మలేని పరిస్థితి నెలకొంది. స్విట్జర్లాండ్‌లో శాంతి ఒప్పందంపై సంతకాలు చేయడమే తరువాయి, కథ సుఖాంతం అయినట్లేనని అమెరికా నమ్మబలుకుతున్నా, ఇటు ఇరాన్, అటు ఇజ్రాయెల్ సన్నాయి నొక్కులు నొక్కుతూనే ఉన్నాయి. టోల్ లేకుండానే నౌకలు సజావుగా రాకపోకలు జరపవచ్చనీ అమెరికా చెబుతున్నా, ట్రాన్సిట్ టోల్ ఫీజు లేకపోయినా నావిగేషన్ సర్వీసులు, ఇతరత్రా సముద్రయాన చార్జీలు వసూలు చేస్తామని ఇరాన్ స్పష్టం చేస్తోంది. అలాగే అమెరికా స్తంభింపజేసిన 12 బిలియన్ డాలర్ల విడుదలకు మార్గం సుగమమైందని ఇరాన్ చెబుతుంటే, అలాంటిదేమీ లేదని అమెరికా అంటోంది. మరోవైపు ఈ శాంతి ఒప్పందంతో తనకు సంబంధం లేదనీ, లెబనాన్‌పై దాడులు కొనసాగుతాయనీ ఇజ్రాయెల్ తెగేసి చెబుతోంది. అదే జరిగితే, ఒప్పందానికి తాము ఒప్పుకోబోమని ఇరాన్ స్పష్టం చేస్తోంది. మిత్రదేశాన్ని దారికి తెచ్చుకోకుండా, కీలకమైన అంశాలపై స్పష్టత లేకుండా శాంతి ఒప్పందంపై అమెరికా చూపిస్తున్న ఆత్రుత లేడికి లేచిందే పరుగన్న సామెతను గుర్తుచేస్తోంది. అమెరికా- ఇజ్రాయెల్ మిత్రద్వయం ఇరాన్‌పై కయ్యానికి కాలుదువ్వడానికి అసలు కారణమైన యురేనియం నిల్వల అప్పగింత అంశం తాజా ఒప్పందంలో ప్రస్తావన పూర్వకంగానైనా లేకపోవడం. అదేమంటే, తర్వాత జరిగే చర్చల్లో దీనిపై పట్టుబడతామంటూ అమెరికా చెప్పడం హాస్యాస్పదం. ఇరాన్ తో యుద్ధం కారణంగా అమెరికాకు 11 లక్షల కోట్ల రూపాయల నష్టం వాటిల్లినట్లు, పెట్రోల్, డీజిల్ ఖర్చుల రూపేణా ప్రతి కుటుంబంపై 447 డాలర్ల మేరకు అదనపు భారం పడినట్లు అంచనా. ఇకపై యుద్ధం కొనసాగితే కలిగే నష్టాలు తలకు మించిన భారంగా పరిణమించడంతోపాటు ఇంటాబయటా చీవాట్లు తప్పవన్న విషయం గ్రహించిన ట్రంప్



ఒప్పందానికి ఆరాటపడుతున్నారు. మూడున్నర నెలల క్రితం మొదలైన అమెరికా, ఇజ్రాయెల్- ఇరాన్ యుద్ధం ప్రపంచ దేశాలను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టింది. మరిన్ని కనుగొనండి ప్రకటనల సేవ ఆధ్యాత్మికం సేవ లైఫ్ స్టైల్ సేవ ూశ్రీంశీ =ఖుస - అద్దెలకు అందని భాగ్యనగరం అనేక దేశాలలో ద్రవ్యోల్బణం మితిమీరి నిత్యావసర వస్తువులు సైతం అందని ద్రాక్షగా మారాయి. పశ్చిమాసియానుంచి చమురుతోపాటు వివిధ దేశాలకు భారీయెత్తున దిగుమతి అయ్యే ఎరువులకూ కటకట ఏర్పడింది. ఫలితంగా అనేక దేశాలలో వ్యవసాయం కుంటుపడి, ఆహార భద్రతకు ముప్పు ఏర్పడుతోంది. ఈ యుద్ధం కారణంగా దాదాపు మూడు కోట్లమంది పేదరికం అంచుకు చేరినట్లు ఐక్యరాజ్య సమితికి చెందిన ఆహార, వ్యవసాయ సంస్థ ఇప్పటికే అంచనా కట్టింది. ఈ నేపథ్యంలో యుద్ధ విరమణ కోసం ప్రపంచ దేశాలన్నీ కళ్లలో వత్తులు వేసుకుని ఎదురు చూస్తున్నాయి. అందరూ కోరుకుంటున్న విధంగా అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ ఈ ఒప్పందానికి కట్టుబడి ఉండాలనీ, పశ్చిమాసియాలో శాంతి సుమాలు విరబూయాలని ఆశిద్దాం.

# ఖమ్మం లైంగిక దాడి బాధితురాలికి నిమ్స్‌లో శస్త్రచికిత్స:

## పరామర్శించి రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందించిన మంత్రి సీతక్క



ఖమ్మం జిల్లాలో లైంగిక దాడికి గురై హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికకు వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించారు.బాలిక ఆరోగ్య పరిస్థితిని స్వయంగా తెలుసుకునేందుకు రాష్ట్ర మంత్రి సీతక్క, తెలంగాణ లీగల్ సర్వీసెస్ అథారిటీ మెంబర్ సెక్రటరీ జస్టిస్ పంచాక్షరి నిమ్స్ ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా బాలికకు అందుతున్న వైద్య చికిత్స, శస్త్రచికిత్స అనంతర పరిస్థితిపై అక్కడి వైద్య బృందం వారికి వివరాలను అందించింది. బాలిక ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన అత్యుత్తమ వైద్య సేవలను అందిస్తున్నట్లు వైద్యులు వెల్లడించారు. అనంతరం ఆసుపత్రిలో ఉన్న బాలిక తల్లిదండ్రులను మంత్రి సీతక్క, జస్టిస్ పంచాక్షరి కలిసి పరామర్శించి ధైర్యం చెప్పారు. ఎవరూ అధైర్యపడవద్దని, రాష్ట్ర ప్రభుత్వం మీ కుటుంబానికి పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫున బాధిత బాలిక కుటుంబానికి రూ. 5 లక్షల ఆర్థిక సహాయ చెక్కును వారు సంయుక్తంగా అందజేశారు.బాలిక పూర్తిగా కోలుకుని సాధారణ జీవితంలోకి తిరిగి వచ్చేంత వరకు అవసరమైన వైద్యం అందించడంతో పాటు, ఆమె పునరావాసం, కుటుంబ అవసరాల విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. బాధితులకు అవసరమైన ఆర్థిక సహాయంతో పాటు భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బంది లేకుండా పూర్తి స్థాయి న్యాయపరమైన సహాయాన్ని కూడా ప్రభుత్వం తరఫున అందిస్తామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# ఖమ్మం నగరంలో అమానుషం

:


పసిప్రాణంపై కామంధుడి దాడి, నాగరిక సమాజానికి సవాల్‌గా మారిన ఘోర ఉదంతం ఖమ్మం నగరంలో మానవత్వాన్ని నిలువునా పూడ్చిపెట్టిన ఒక అమానుష ఘటన వెలుగులోకి వచ్చింది. సమాజం ఎంతగా ఆధునికత వైపు అడుగులు వేస్తూ ఆకాశాన్ని తాకాలని చూస్తున్నా, మనుషుల్లోని మృగత్వం మాత్రం పసిప్రాణాలను బలితీసుకుంటూనే ఉందనడానికి ఈ ఘోర ఉదంతమే ప్రత్యక్ష సాక్ష్యం. ఒక అపార్ట్‌మెంట్‌లో రక్షణగా ఉండాల్సిన చోటే, నమ్మకంగా తిరిగే ఒక వ్యక్తి పన్నెండేళ్ల పసికూనపై రాక్షసత్వానికి ఒడిగట్టాడు. ఈ దారుణమైన సంఘటన స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించడమే కాకుండా, పౌర సమాజం తలదించుకునేలా చేసింది. ఖమ్మం నగరానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ అందించిన పూర్తి వివరాల ప్రకారం, ఈ ఘోరానికి సంబంధించిన దర్యాప్తు, బాధితురాలి పరిస్థితి గురించిన ప్రత్యేక విశ్లేషణాత్మక కథనం ఇది.

### బాధితురాలు మరియు నిందితుడి వివరాలు

ఈ ఘోరానికి గురైన బాధితురాలు ఒక గురుకుల పాఠశాలలో చదువుకుంటున్న పన్నెండేళ్ల మైనర్ బాలిక. వేసవి సెలవులు కావడంతో ఆడుకోవడానికి, సరదాగా గడపడానికి ఖమ్మం నగరంలోని ఒక అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న తన తాతయ్య వద్దకు వచ్చింది. అక్కడ నివసించే వారు ఆ పసిపాపను ఎంతో ప్రేమగా, మురిపెంగా చూసుకునేవారు. అయితే అదే అపార్ట్‌మెంట్‌లో ఒక నివాసి వద్ద ప్రైవేట్ డ్రైవర్‌గా పనిచేస్తున్న నలభై తొమ్మిదేళ్ల మహ్మద్ గౌస్ పాషా కన్ను ఆ చిన్నారిపై పడింది. నమ్మకంగా తిరుగుతూనే, ఆ పసిప్రాణాన్ని ఎలా లొంగదీసుకోవాలా అని అతడు సమయం కోసం వేచి చూశాడు.

### వారం రోజుల ముందే పొంచివున్న ప్రమాదం

నిజానికి ఈ ఘోర సంఘటన జరగడానికి ఒక వారం రోజుల ముందే నిందితుడు గౌస్ పాషా ఆ బాలికపై లైంగికంగా వేధించడానికి, అసభ్యంగా ప్రవర్తించడానికి ప్రయత్నించాడు. భయపడిపోయిన ఆ చిన్నారి ప్రాణభయంతో అతడి నుండి తప్పుకుంటూ ఈ విషయాన్ని తన తల్లికి వివరించింది.కూతురు పడుతున్న నరకాన్ని చూసి తల్లడిల్లిపోయిన ఆ తల్లి, కన్నీరుమున్నీరవుతూ ఈ దురాగతం గురించి స్థానికంగా ఉండే ఒక వ్యక్తికి మొరపెట్టుకుంది. కానీ దురదృష్టవశాత్తూ ఆ కన్నీళ్లను ఎవరూ పట్టించుకోలేదు. వారికి సమాజం నుండి సరైన మద్దతు లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసే ధైర్యం కూడా ఆ పేద కుటుంబం చేయలేక పోయింది. ఒకవేళ ఆ రోజే ఎవరైనా బాధ్యతగా స్పందించి ఉంటే, బహుశా ఈ ఘోర కలిని ముందే నివారించే అవకాశం ఉండేది.



జూన్ ఆరవ తేదీన జరిగిన ఘోర ఉదంతం

జూన్ ఆరవ తేదీ సాయంత్రం వేళ ఆ మృగత్వం అంతకంతకూ పెరిగిపోయి భయంకరమైన రూపం దాల్చింది. సాయంత్రం సమయంలో బాలిక ఆడుకోవడానికి అపార్ట్‌మెంట్ రెండో అంతస్తుకు వెళ్తుండగా, కామంధుడైన గౌస్ పాషా ఆమెను వెంబడించాడు. ఎవరూ లేని నిర్జన సమయం చూసి ఆమెను వెనుక నుంచి పట్టుకుని, అసభ్యంగా తాకుతూ అత్యాచారానికి ప్రయత్నించాడు. ఊహించని ఈ విపత్తుకు ఆ చిన్నారి ప్రాణభయంతో వణికిపోయింది. తన పాపం ఎక్కడ బయటపడుతుందో, పాప అరిస్తే ఎక్కడ అందరికీ తెలిసిపోతుందో అనే భయంతో ఆ రాక్షసుడు బాలిక నోరు నొక్కి, బలవంతంగా అపార్ట్‌మెంట్ నాల్గవ అంతస్తుకు లాక్కెళ్లాడు. ఏమాత్రం జాలి, కరుణ లేకుండా ఆమెను నాల్గవ అంతస్తు పైనుంచి కిందకు విసిరేశాడు.

### తీవ్ర గాయాలు మరియు నిజాన్ని దాచే ప్రయత్నం

పైనుంచి పడిన పెద్ద శబ్దానికి బాలిక తాతయ్య పరుగున వచ్చి చూడగా, తన ప్రాణసమానమైన మనవరాలు రక్తపు మడుగులో, ముక్కు, మొహం అంతా తీవ్రమైన గాయాలతో అచేతనంగా పడి ఉంది. వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు ఆ చిన్నారి వెన్నుముకకు తీవ్రమైన గాయాలయ్యాయని, కుడి భుజం మరియు పక్కటెముకలు విరిగిపోయాయని నిర్ధారించారు. అయితే, పేదరికంలో ఉన్న ఆ వాచ్‌మన్ కుటుంబం ఎక్కడ వీధిన పడుతుందో, బతుకు దెరువు దెబ్బతింటుందో అనే భయంతో మొదట ఈ కేసును తప్పుదోవ పట్టించడానికి ప్రయత్నాలు జరిగాయి. ఇది ప్రమాదవశాత్తు పైనుంచి పడిపోయినట్లు నమ్మించే ప్రయత్నం చేశారు. కానీ, మెజిస్ట్రేట్ కౌన్సెలింగ్ సమయంలో, ఆసుపత్రి బెడ్‌పై విరిగిన ఎముకలతో చావుతో పోరాడుతున్న ఆ చిన్నారి ధైర్యం చేసి, మెజిస్ట్రేట్ ముందు కన్నీరు మున్నీరుగా తనపై జరిగిన ఘోరాన్ని వాంగ్మూలంగా ఇవ్వడంతో అసలు నిజం వెలుగులోకి వచ్చింది.

### చట్టపరమైన చర్యలు మరియు ప్రజా నిరసనలు

పసిపాప ఇచ్చిన వాంగ్మూలంతో నిజం తెలిసిన వెంటనే పోలీసులు వేగంగా కదిలారు. నిందితుడు మహ్మద్ గౌస్ పాషాపై పోక్సో చట్టంలోని కఠినమైన సెక్షన్లతో పాటు, భారతీయ న్యాయ సంహితలోని హత్య యత్నం సెక్షన్ కింద కేసులు నమోదు చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని ఫాస్ట్ ట్రాక్ కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు. ఈ దారుణం వెలుగులోకి రాగానే ఖమ్మం నగరంలో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. భారతీయ జనతా పార్టీ నాయకులు, స్థానిక స్వచ్ఛంద సంస్థలు ఈ క్రూరత్వాన్ని తీవ్రంగా ఖండించారు. బాధితురాలికి తక్షణమే న్యాయం చేయాలని, కామంధుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ నిరసనలు చేపట్టారు. చట్టాలు, పోలీసులు, వైద్య వ్యవస్థలతో పాటు పౌర సమాజం కూడా కలిసికట్టుగా స్పందించి భవిష్యత్తు తరాలకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని, ఈ ఘోరం ప్రతి ఒక్కరి మనస్సాక్షిని మేల్కొల్పే ఒక చారిత్రక హెచ్చరిక కావాలని జర్నలిస్ట్ తన కథనంలో ఆవేదన వ్యక్తం చేశారు.

# ఈశాన్య భారత్‌లో 'సైలెంట్ టీబీ' కలకలం

### లక్షణాలు లేకుండానే వేలాది మందికి ఇన్ఫెక్షన్!

దేశంలోనే అత్యంత అందమైన ప్రాంతంగా పేరుగాంచిన ఈశాన్య భారతదేశం నుంచి ప్రస్తుతం ఒక ఆందోళనకరమైన ఆరోగ్య సమాచారం వెలుగులోకి వచ్చింది. అక్కడ ఎటువంటి లక్షణాలు లేకుండానే వేలాది మంది ప్రాణాంతక క్షయవ్యాధి (టీబీ) బారిన పడుతున్నట్లు వెల్లడైంది. జాతీయ క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసిన 2025-26 వార్షిక నివేదిక ఈ షాకింగ్ నిజాలను బయటపెట్టింది. సాధారణంగా దగ్గు, జ్వరం, రాత్రి వేళల్లో చెమటలు పట్టడం, బరువు తగ్గడం వంటి లక్షణాల ద్వారా టీబీని గుర్తిస్తారు. కానీ, తాజా గణాంకాల ప్రకారం ఈశాన్య రాష్ట్రాల్లో నమోదవుతున్న ప్రతీ ముగ్గురు బాధితుల్లో ఒకరికి ఎలాంటి లక్షణాలు కనిపించకపోవడం గమనార్హం.

### భారీ స్క్రీనింగ్ పరీక్షలు -వెలుగులోకి వచ్చిన వాస్తవాలు

క్షయవ్యాధి నిర్మూలన లక్ష్యంగా ఈశాన్య ప్రాంతంలోని ఎనిమిది రాష్ట్రాల్లో ఆరోగ్య శాఖ యుద్ధప్రాతిపదికన ముమ్మర తనిఖీలు చేపట్టింది. బలహీన వర్గాలు, వ్యాధి సోకే ప్రమాదం ఎక్కువగా ఉన్న సమూహాలను లక్ష్యంగా చేసుకుని దాదాపు 39 లక్షల మందికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. వీరిలో సుమారు 6 లక్షల మందికి ఛాతీ ఎక్స్-రేలు కూడా తీశారు.ఈ ముందస్తు తనిఖీల వల్ల మొత్తం 41,727 మంది టీబీ రోగులను గుర్తించగా, వారిలో ఏకంగా 14,356 మందికి ఎటువంటి లక్షణాలు లేవనిలిలి తేలింది. అంటే మొత్తం కేసుల్లో సుమారు 34 శాతం మంది తమకు వ్యాధి సోకిన విషయమే తెలియకుండా సమాజంలో సాధారణ జీవితాన్ని గడుపుతున్నారు. సాధారణంగా అనారోగ్యం వస్తే తప్ప ఆసుపత్రులకు వెళ్లని వారిని గుర్తించడంలో ఈ చురుకైన తనిఖీలు ఎంతగానో దోహదపడ్డాయి.

### రాష్ట్రాల వారీగా కేసుల తీవ్రత

లక్షణాలు లేని ఈ ప్రమాదకరమైన టీబీ కేసులు అత్యధికంగా అస్సాంలో 10,362నమోదయ్యాయి. దీని తర్వాత స్థానాల్లో మేఘాలయలో 1,055 కేసులు, నాగాలాండ్‌లో 857 కేసులు, త్రిపురలో 510 కేసులు బయటపడ్డాయి. అలాగే అరుణాచల్ ప్రదేశ్‌లో 479, మణిపూర్‌లో 465, సిక్కింలో 380, మరియు మిజోరంలో 248 కేసులు నమోదైనట్లు ఆరోగ్య శాఖ నివేదిక స్పష్టం చేసింది.

### వ్యాప్తి నియంత్రణలో సవాళ్లు..రంగంలోకి అధునాతన ఏఐ సాంకేతికత

వ్యాధి లక్షణాలు బయటపడకపోవడం అనేది టీబీ నియంత్రణలో వైద్య సిబ్బందికి అతిపెద్ద సవాలుగా మారుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి వ్యక్తులు తమకు వ్యాధి ఉన్నట్లు తెలియక చికిత్స తీసుకోకుండా చాలా కాలం ఉండిపోతారు. దీనివల్ల సమాజంలో ఇతరులకు కూడా ఈ ఇన్ఫెక్షన్ వేగంగా వ్యాపించే ప్రమాదం విపరీతంగా పెరుగుతుంది. అందుకే ఆరోగ్య శాఖ కేవలం ఆసుపత్రులకు వచ్చే రోగులపైనే ఆధారపడకుండా, స్వయంగా క్షేత్రస్థాయికి వెళ్లి ఇంటింటికీ పరీక్షలు నిర్వహిస్తోంది.టీబీని ముందస్తుగా, వేగంగా గుర్తించేందుకు ప్రస్తుతం ఆధునిక సాంకేతికతను వాడుతున్నారు. మేఘాలయ వంటి రాష్ట్రాల్లో కాఫ్ ఎగైనెస్ట్ టీబీ' యాప్ తో పాటు ఏఐ ఆధారిత పోర్టబుల్ ఎక్స్-రే యూనిట్లనులిలి రంగంలోకి దించి మారుమూల ప్రాంతాల్లో పరీక్షలు జరుపుతున్నారు.ఈ ప్రచార తీవ్రత కారణంగానే, సెప్టెంబర్ 2025 నాటికే ఈశాన్య ప్రాంతంలో 10.7 లక్షలకు పైగా అనుమానితులకు పరీక్షలు నిర్వహించడం సాధ్యమైంది. ప్రజల్లో అవగాహన పెంచడం, ముందస్తు నిర్ధారణ పరీక్షలు చేయడం మరియు సకాలంలో చికిత్స అందించడం ద్వారానే ఈ 'సైలెంట్ టీబీ' మహమ్మారిని పూర్తిగా అరికట్టవచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.



# హాజీపూర్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన మంచిర్యాల డీసీపీ





**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 18:**

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జోన్‌లో ఉన్న హాజీపూర్ పోలీస్ స్టేషన్‌ను మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా సీఐ రవీందర్, ఎస్ఐ కిరణ్ కుమార్‌లు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం డీసీపీ పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించి స్టేషన్ పరిసరాలు, రిసెప్షన్ సెంటర్, రికార్డులు, పెండింగ్ కేసుల ఫైళ్లు, క్రైమ్ రికార్డులు, సీసీటీఎన్ఎస్ నమోదు ప్రక్రియలను క్షుణ్ణంగా పరిశీలించారు. నమోదైన కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ వ్యవహారాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీసీపీ ఎగ్గడి భాస్కర్ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటూ సీసీ కెమెరాల ఫుటేజీని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రతి కానిస్టేబుల్ గ్రామ పోలీసు అధికారిగా గ్రామాలను సందర్శిస్తూ ప్రజలతో సత్సంబంధాలు పెంపొందించుకోవడంతో పాటు సమాచార వ్యవస్థను పటిష్ఠం చేయాలని ఆదేశించారు. చట్టాలపై, సైబర్ నేరాలపై, సీసీ కెమెరాల ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలని సూచించారు. రహదారి భద్రత, ట్రాఫిక్ నియమాలు, హెల్మెట్, సీటు బెల్టు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని, గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖలతో సమన్వయం కొనసాగుతోందన్నారు. అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ కోసం రాత్రి పెట్రోలింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. హాజీపూర్ పోలీస్ స్టేషన్ సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నారని అభినందిస్తూ ఇదే స్ఫూర్తితో మరింత నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ఈ తనిఖీల్లో ఏసీపీ ప్రకాశ్, సీఐ రవీందర్, ఎస్ఐ కిరణ్ కుమార్‌తో పాటు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# టీజీఎస్ఆర్టీసీ పురోగతిపై మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష

## జూలై 1 నుంచి 11 శాతం ఫిట్‌మెంట్, త్వరలో గుర్తింపు సంఘాల ఎన్నికలు!

రాష్ట్రంలో ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడి 30 నెలలు పూర్తి కావస్తున్న సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) సాధించిన పురోగతి, భవిష్యత్ కార్యాచరణపై రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సంస్థ ఎండీ నాగిరెడ్డి, ఈడీలు, ఇతర విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ ఉద్యోగులకు పెద్ద ఊరటనిస్తూ, గత ఆర్టీసీ సమ్మె కాలంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆర్పీఎస్-2021కు సంబంధించిన 11 శాతం ఫిట్‌మెంట్‌ను జూలై 1 నుంచి అమలు చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. అలాగే, ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికల అధికారితో చర్చించి, త్వరలోనే ఎన్నికల ప్రక్రియ షెడ్యూల్‌ను విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేసిన మంత్రి, ఇటీవల ఆత్మహత్య చేసుకున్న ఆర్టీసీ ఉద్యోగి శంకర్ కుటుంబానికి ఉద్యోగుల నుండి సేకరించిన నిధులతో త్వరలోనే రూ. 1 కోటి ఆర్థిక సహాయ చెక్కును అందజేయాలని సూచించారు. దాంతో పాటు ఆయన కుటుంబంలో ఒకరికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం, ఒక ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కాగా, ఉద్యోగుల ప్రమాద బీమా పథకం కింద ఇప్పటివరకు 11 కేసులను పరిష్కరించి బాధితులకు ఒక్కో కుటుంబానికి రూ. 1 కోటి చొప్పున అందజేశామని తెలిపారు. గత 30 నెలల కాలంలో బ్రెడ్ విన్నర్ స్కీమ్, మెడికల్ ఇన్వాలిడేషన్ కింద మొత్తం 1,137 కారుణ్య నియామకాలు చేపట్టామని, అందులో 888 మంది కండక్టర్లు, 10 మంది డ్రైవర్లు, 43 మంది శ్రామిక్‌లు, 196 మంది కానిస్టేబుళ్లు ఉన్నారని వెల్లడించారు. పెండింగ్‌లో ఉన్న మిగిలిన నియామకాలను వెంటనే పూర్తి చేయాలని, గతంలో సర్వీస్ నుండి తొలగించిన 490 మందిలో ఇప్పటికే 244 మందిని విధుల్లోకి తీసుకోగా, మిగతా కేసులను త్వరగా పరిశీలించాలని సూచించారు. గత 2023-26 మధ్యకాలంలో ప్రభుత్వం రూ. 1,078 కోట్ల వ్యయంతో 2,815 నూతన



బస్సులను కొనుగోలు చేసిందని, తార్నాక ఆర్టీసీ ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా అభివృద్ధి చేశామని మంత్రి తెలిపారు. ప్రభుత్వ చర్యల వల్ల సీసీఎస్ బకాయిలు రూ. 1,096.90 కోట్ల నుండి రూ. 862 కోట్లకు, పీఎఫ్ బకాయిలు రూ. 2,018.15 కోట్ల నుండి రూ. 1,714.39 కోట్లకు, ఎస్ఆరబ్ల్యూస్, ఎస్బీటీ బకాయిలు రూ. 493.02 కోట్ల మేర తగ్గాయని వివరించారు. ప్రస్తుతం ఆర్టీసీ పరిధిలో 10,173 బస్సులు, 38,128 మంది ఉద్యోగులతో నిత్యం 35 లక్షల కిలోమీటర్ల మేర ప్రయాణిస్తూ సుమారు 61 లక్షల మంది ప్రయాణికులకు సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కాలుష్య నియంత్రణ, ఈవీ విధానం, ఎలక్ట్రిక్ బస్సుల విస్తరణపై చర్చించేందుకు దక్షిణ భారత రాష్ట్రాల రవాణా శాఖ మంత్రులు, ప్రిన్సిపల్ సెక్రటరీలు, కమిషనర్లు, ఆర్టీసీ ఎండీలతో ఒక ప్రత్యేక ప్రాంతీయ సమావేశాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా బస్ స్టేషన్లు, డిపోల ఆధునికీకరణపై మంత్రి సుదీర్ఘ సమీక్ష జరిపారు. నాగర్‌కర్నూల్, పెద్దపల్లి బస్ డిపోల పనులను వేగవంతం చేయాలని, ములుగు బస్ స్టేషన్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. వారం రోజుల్లో వేములవాడ, కథలాపూర్ బస్ స్టేషన్‌లకు శంకుస్థాపన జరిగేలా చూడాలని, మహబూబ్‌నగర్ పర్యటనలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా అక్కడి బస్ స్టేషన్‌కు శంకుస్థాపన చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. హుజూర్‌నగర్, కోదాడ, నాగర్‌కర్నూల్ బస్ స్టేషన్‌లకు కూడా త్వరలోనే శంకుస్థాపనలు నిర్వహించాలని సూచించారు. మునుగోడు, చండూరు, మర్రిగూడ స్టేషన్ల పునరుద్ధరణ, నాంపల్లి స్థల పరిశీలన, మధిర పనుల వేగవంతంపై సమీక్షించారు. గోదావరిఖని బస్ స్టేషన్‌ను వాణిజ్యపరంగా మరింత సమర్థవంతంగా వాడుకోవాలని సూచిస్తూ, మంచిర్యాల, చెన్నూరు, మెదక్, బెల్లంపల్లి, పరకాల, ములకనూరు, ధర్మపురి, మక్తల్ బస్ స్టేషన్లను అధికారులు ప్రత్యేకంగా సందర్శించి కొత్త నిర్మాణాలు లేదా రినోవేషన్లపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం మహిళల ఆర్థిక సాధికారతపై చూపుతున్న ప్రభావాన్ని నిరంతరం అధ్యయనం చేసి ఫీడ్‌బ్యాక్ సేకరించాలని మంత్రి అధికారులను కోరారు. అలాగే మహిళా సంఘాలను 553 బస్సులకు యజమానులుగా చేసి అద్దె ప్రాతిపదికన నడుపుతున్న నేపథ్యంలో వారి అభిప్రాయాలను కూడా తెలుసుకోవాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో నడుస్తున్న 1,050 ఎలక్ట్రిక్ బస్సుల రూట్లు, వాటి లాభనష్టాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశిస్తూ, బస్ స్టేషన్ల అభివృద్ధికి అవసరమైన భూ బదలాయింపు ప్రక్రియలను కూడా వేగవంతం చేయాలని అధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ దిశా నిర్దేశం చేశారు.

# మైనింగ్ వివాదం.. కారుకు నిప్పు.. బీజేపీ నేత సహా ముగ్గురి సజీవ దహనం

చత్తీస్‌ఘడ్‌లో దారుణం జరిగింది. సాండ్ మైనింగ్ వివాదం ముగ్గురి ప్రాణాలను బలి తీసుకున్నది. ఫార్చ్యూనర్ వాహనానికి నిప్పుపెట్టడంతో దాంట్లో ఉన్న ముగ్గురు వ్యక్తులు సజీవ దహనం అయ్యారు. ఈ ఘటన కోరియా జిల్లాలో జరిగింది. ప్లాన్ ప్రకారం ఈ హత్య జరిగినట్లు తెలుస్తోంది. ట్రక్కుల మధ్య ఫార్చ్యూనర్ వాహనాన్ని ట్రాప్ చేసి, దానిపై పెట్రోల్ పోసి నిప్పు అంటించారు. మృతుల్లో స్థానిక బీజేపీ నేత, మాజీ పంచాయతీ ప్రెసిడెంట్ భరత్ సింగ్ ఉన్నారు. సోనాహట్ పోలీసు స్టేషన్ పరిధిలోని నౌగెయిన్ గ్రామ పరిధిలో మంగళవారం రాత్రి ఈ ఘటన జరిగింది. ఇసుక మైనింగ్ ఆపరేషన్‌కు చెందిన ఓ సమస్య పరిష్కారం కోసం భరత్ సింగ్ చర్చలకు వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కానీ అతన్ని ట్రాప్ చేసి చంపారని ఆరోపణలు వస్తున్నాయి. ఈ కేసులో ఇప్పటికే నలుగురు నిందితుల్ని అరెస్టు చేశారు. అక్షత్ త్రిపాఠి, విశాల్ త్రిపాఠి, సత్యప్రకాశ్ త్రిపాఠి, మన్ను త్రిపాఠిలను అదుపులోకి తీసుకున్నారు. ఇతర నిందితుల కోసం గాలిస్తున్నారు. మొత్తం 9 మందిపై మర్డర్ కేసు నమోదు చేశారు. ఈ మర్డర్ ఘటనతో కొరియా జిల్లాలో తీవ్ర అలజడి రేగుతోంది. ప్రస్తుతం అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. పోలీసుల సమాచారం ప్రకారం.. స్థానిక ఇసుక





వ్యాపారాన్ని భతర్ సింగ్ కుటుంబానికి ప్రభుత్వం అప్పగించింది. అయితే సోనాహట్, కైలాష్‌పూర్, తేలిముడ, బేలియా, చిన్‌గుర ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమ మైనింగ్ అంశంలో వివాదం మొదలైంది. భరత్ సింగ్ ఫ్యామిలీతో పాటు మరో బీజేపీ నేత మనోజ్ త్రిపాఠి కుటుంబం మధ్య చాన్నాళ్లుగా మైనింగ్ పట్టు కోసం వార్ నడుస్తోంది. త్రిపాఠి ఫ్యామిలీ వద్ద టిప్పర్ ట్రక్కులు ఉన్నాయి. అయితే పేమెంట్ అంశంలో రెండు ఫ్యామిలీల మధ్య గొడవలు జరుగుతున్నట్లు తెలిసింది. ఘటన జరిగిన రాత్రి.. భరత్ సింగ్ వాహనాన్ని ట్రక్కులతో చుట్టు ముట్టారు. ఫార్చ్యూనర్‌కు ముందు, వెనుక లారీలను నిలిపి, ఎటు కదలకుండా బంధీ చేసి, ఆ తర్వాత వాహనానికి నిప్పు పెట్టారని పోలీసులు చెప్పారు. భరత్ సింగ్ అనే వ్యక్తి కారులోనే సజీవ దహనమైనట్లు గుర్తించామన్నారు. మృతుల్లో వీరేంద్ర సింగ్, నాగేంద్ర సింగ్ కూడా ఉన్నారు. మయాంక్ సింగ్ అనే మరో వ్యక్తి బిలాస్‌పూర్‌లోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో ఉన్న భరత్ సింగ్.. భూపేశ్ భగేల్ ప్రభుత్వ సమయంలో బీజేపీలో చేరారు. మైనింగ్ ఏరియాలో భరత్ సింగ్ అంటే అందరికీ భయమే. తన ఫార్చ్యూనర్ వాహనానికి అతను హూటర్ పెట్టుకుని తిరిగేవాడు. అయితే ఈ మర్డర్ కేసులో సీబీఐ దర్యాప్తు చేపట్టాలని బాధిత కుటుంబం డిమాండ్ చేసింది. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పక్కా ప్లాన్ ప్రకారమే అటాక్ చేశారని ఆరోపించారు. అయితే భరత్ సింగ్ కారు అగ్నిప్రమాదానికి ఎలా గురైందో తెలియదని పోలీసులు చెబుతున్నారు. ఆ కోణంలో ఇంకా దర్యాప్తు చేపడుతున్నామన్నారు.


# లక్కారంలో గంజాయి కలకలం

## గోడలపై యువకుల ఫొటోలతో సంచలన పోస్టర్లు.. గ్రామంలో భయాందోళన

## 'గంజాయి మత్తులో మహిళలపై వేధింపులు' అంటూ ఆరోపణలు -- వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామస్థుల డిమాండ్

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 18**






ముత్తారం మండలం లక్కారం గ్రామంలో గంజాయి వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గ్రామంలోని ప్రధాన వీధులు, గోడలపై కొందరు యువకుల ఫొటోలతో కూడిన సంచలన పోస్టర్లు వెలిసిన ఘటన కలకలం రేపుతోంది. పోస్టర్లలో చేసిన ఆరోపణలు గ్రామ ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. పోస్టర్లలో పేర్కొన్న వివరాల ప్రకారం, కొందరు యువకులు గంజాయి మత్తుకు బానిసలై గ్రామంలో స్వేచ్ఛగా సంచరిస్తూ మహిళలు, బాలికలను వేధిస్తున్నారని ఆరోపించారు. దీంతో గ్రామంలో మహిళలు భయాందోళనకు గురవుతున్నారని, సాయంత్రం తర్వాత బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడిందని పోస్టర్లలో పేర్కొన్నారు. గ్రామంలో గంజాయి విక్రయాలు, వినియోగం బహిరంగ రహస్యంగా మారిందా? యువత మాదకద్రవ్యాల బారిన పడుతోందా? అనే ప్రశ్నలు స్థానికంగా చర్చకు దారితీశాయి. గోడలపై ఫొటోలతో పోస్టర్లు అతికించే పరిస్థితి రావడం వెనుక గ్రామస్థుల ఆవేదనే కారణమా అనే చర్చ కూడా సాగుతోంది. గంజాయి వ్యవహారంపై పోలీసు శాఖ, ఎక్సైజ్ అధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలికితీయాలని గ్రామస్థులు కోరుతున్నారు. పోస్టర్లలో పేర్కొన్న ఆరోపణల్లో నిజానిజాలు తేల్చి, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే పోస్టర్లలో చేసిన ఆరోపణలపై ఇప్పటివరకు పోలీసుల నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఈ ఆరోపణలపై విచారణ అనంతరం మాత్రమే వాస్తవ పరిస్థితి స్పష్టమయ్యే అవకాశం ఉంది. గ్రామంలో చోటుచేసుకున్న ఈ పరిణామం స్థానికంగా తీవ్ర చర్చకు దారితీసింది.

# 2 లక్షల రూపాయలు మంజూరు



**జగిత్యాల ప్రతినిధి జూన్ 18:**

జగిత్యాల పట్టణ వాసినగర్ కి చెందిన రాపర్తి సత్యనారాయణ జీర్ణ వ్యవస్థ సంబంధిత సమస్య తో అనారోగ్యం తో బాధపడుతూ చికిత్స చేసుకొనే ఆర్థిక స్థోమత లేక బాధపడుతూ ఉండగా స్థానిక నాయకులు జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ దృష్టికి విషయాన్ని తీసుకురాగా స్పందించిన ఎమ్మెల్యే నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం సీఎం సహాయనిధి ద్వారా 2 లక్షల రూపాయలు గాజ మంజూరు చేయించి సత్యనారాయణ కుటుంబ సభ్యులకు అందజేశారు. వైద్యులతో మాట్లాడుతూ మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. వెంట నరేందర్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

# భీమారంలో ఘనంగా వనమహోత్సవం: మొక్కలు నాటిన జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**అర్జున్ సమాచారం , (భీమారం):జూన్ 18**

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ శ్రీ కుమార్ దీపక్, ఐఏఎస్ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రమైన భీమారంలో సెక్షన్ అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా




పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ గారు స్వయంగా మొక్కలు నాటి, నీళ్లు పోసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. భావితరాలకు పచ్చని పర్యావరణాన్ని అందించడమే వనమహోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశం. కేవలం మొక్కలు నాటడమే కాకుండా, అవి వృక్షాలుగా మారేంతవరకు సంరక్షించే బాధ్యతను స్థానిక ప్రజలు, అధికారులు తీసుకోవాని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఎఫ్‌డిఓ సర్వేశ్వర్ , ఎఫ్ఆర్ఓ రత్నాకర్ ,డివైఆర్ఓ సుధాకర్, జిల్లా అటవీ శాఖ అధికారులు, రెవెన్యూ సిబ్బంది మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.



# నీట్ రీ-ఎగ్జామినేషన్‌కు పటిష్ట భద్రతా ఏర్పాట్లు





పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 18

ఈ నెల 21న నిర్వహించనున్న నీట్ రీ-ఎగ్జామినేషన్ నేపథ్యంలో రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ గురువారం పరిశీలించారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలతో పాటు ఇతర పరీక్షా కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, పరీక్షను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని భద్రతా చర్యలను రూపొందించినట్లు తెలిపారు. పరీక్షకు అధిక సంఖ్యలో మహిళా అభ్యర్థులు హాజరయ్యే అవకాశం ఉన్నందున బందోబస్తు విధుల్లో మహిళా పోలీసు సిబ్బంది, మహిళా హోంగార్డులను ఎక్కువ సంఖ్యలో నియమించనున్నట్లు చెప్పారు. ప్రశ్నాపత్రాల రవాణా, భద్రపరిచడం, సమాధాన పత్రాలను సురక్షితంగా డిపాజిట్ చేయడం వంటి ప్రక్రియలకు ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. డీసీపీలు, ఏసీపీలు, ఇతర అధికారులు జిల్లా యంత్రాంగంతో సమన్వయంగా పనిచేసి పరీక్షను ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా నిర్వహిస్తారని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, గతంలో జరిగిన ప్రశ్నాపత్రం లీకేజీ ఘటన నేపథ్యంలో ఈ రీ-ఎగ్జామినేషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంచిర్యాల జిల్లాలో మొత్తం 1,204 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానుండగా, వారి కోసం ఐదు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతి పరీక్షా గదిలో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి, పరీక్ష నిర్వహణకు అవసరమైన అన్ని భద్రతా, పర్యవేక్షణ చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. గతంలో మాదిరిగానే ఈసారి కూడా పోలీసు శాఖ, పరీక్ష నిర్వహణ సంస్థ, విద్యాసంస్థల సిబ్బంది, రెవెన్యూ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి నీట్ రీ-ఎగ్జామినేషన్‌ను విజయవంతంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్, మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## కాటారం లో పలు కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 18

మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ కాటారం మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మరణించిన వారి కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆదివారంపేట గ్రామంలో ఇటీవల మరణించిన సూరం మల్లమ్మ, తోటపల్లి సమ్మిరెడ్డి కుటుంబాలను పరామర్శించిన ఆయన, వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. అనంతరం ఓడిపిలవంచ గ్రామంలో ఇటీవల మరణించిన వడ్లకొండ సమ్మయ్య, పురుషోత్తం మల్లమ్మ, వావిల్ల బానయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఈ కష్టకాలంలో ధైర్యంగా ఉండాలని సూచిస్తూ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## విద్యాసంస్థల బస్సు డ్రైవర్లు భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలి: గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్



పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 18

పాఠశాలలు, కళాశాలలకు చెందిన బస్సు డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్ సూచించారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు, రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ గోదావరిఖని సబ్‌డివిజన్ పరిధిలోని పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు, బస్సు డ్రైవర్లకు ఎన్‌టీపీసీ మిలీనియం హాల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏసీపీ ఎం. రమేష్ మాట్లాడుతూ, విద్యాసంస్థలు అనుభవం, నైపుణ్యం కలిగిన డ్రైవర్లను మాత్రమే నియమించుకోవాలని సూచించారు. విద్యార్థులను ఎక్కించే, దించే సమయంలో నిర్దేశిత ప్రదేశాల్లోనే బస్సులను నిలిపివేయాలని, అతివేగంగా వాహనాలు నడపడం, ప్రమాదకరంగా ఓవర్‌టేకింగ్ చేయడం చేయరాదని చెప్పారు. మద్యం సేవించి వాహనాలు నడపడం లేదా సెల్‌ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయడం తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రైవర్లు చేసే తప్పిదాలకు సంబంధిత పాఠశాల లేదా కళాశాల యాజమాన్యాలే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రామగుండం సీఐ కృష్ణకుమార్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్ రెడ్డి, ఎన్‌టీపీసీ ఎస్ఐ ఉదయ్ కిరణ్, రామగుండం ఎస్ఐ సంధ్యారాణి, రామగిరి ఎస్ఐ శ్రీనివాస్, ముత్తారం ఎస్ఐ రవికుమార్, పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాళ్లు, బస్సు డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

## బొంపల్లి గ్రామంలో పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే నిర్వహణ

పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 18

పెద్దపల్లి జిల్లా బొంపల్లి గ్రామంలో గణాంక శాఖ ఆధ్వర్యంలో పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫ్ఎస్) నిర్వహించినట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లా గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. జాతీయ గణాంక శాఖ ఆధ్వర్యంలో 2026 సంవత్సరానికి సంబంధించిన ప్రజల ఉపాధి స్థితిగతులను అంచనా వేసేందుకు ఈ సర్వే చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన గ్రామాలు, పట్టణాల్లో సర్వే నిర్వహిస్తున్నామని, తొలుత కుటుంబాల సాధారణ వివరాలను సేకరించి, అనంతరం ఎంపిక చేసిన కుటుంబాలను మూడు నెలల పాటు ప్రతి నెల ఒకసారి మొబైల్ ట్యాబ్ ద్వారా సందర్శించి పూర్తి వివరాలు నమోదు చేస్తామని తెలిపారు. సర్వేలో కుటుంబ యజమాని పేరు, కుటుంబ సభ్యుల విద్యార్హతలు, చదువు మానేసిన వివరాలు, ఉన్నత విద్య, వృత్తి విద్యా కోర్సులు, ఉద్యోగం, స్వయం ఉపాధి, రోజువారీ కూలీల పని గంటలు, వేతన వివరాలు, మహిళల ఆదాయ వనరులు, అలాగే జొమాటో, స్విగ్గి, రాపిడో, ఓలా,




ఉబర్ వంటి ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా పనిచేసే గిగ్ వర్కర్లు, ఆన్‌లైన్ డెలివరీ సిబ్బందికి సంబంధించిన వివరాలను నమోదు చేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర గణాంక శాఖ నిర్వహిస్తున్న ఈ సర్వేలు నిరంతర ప్రక్రియలో భాగమని, ప్రజలు గణాంక శాఖ అధికారులకు పూర్తి సహకారం అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బొంపల్లి గ్రామ సర్పంచ్ దాడి మౌనిక సంపత్ యాదవ్, ఉప సర్పంచ్ పంబాల రాజు, వార్డు సభ్యులు, అంగన్వాడీ టీచర్ కడారి కనకలక్ష్మి, ఏఎన్ఎం నగూరి రాజేశ్వరి, ఆశా వర్కర్ సంటి లలిత, గ్రామపంచాయతీ సిబ్బంది సంటి శ్రీకాంత్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ పత్తి విత్తనాల విక్రేతపై పీడీ చట్టం అమలు

పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 18

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో నకిలీ పత్తి విత్తనాల అక్రమ వ్యాపారంపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. మంచిర్యాల జిల్లా తాండూర్, భీమారం పోలీస్ స్టేషన్‌ల పరిధిలోని గ్రామాలకు నకిలీ పత్తి విత్తనాలను సరఫరా చేస్తున్న విక్రేతపై పీడీ (ప్రివెంటివ్ డిటెన్షన్) చట్టాన్ని అమలు చేసినట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. ఆంధ్రప్రదేశ్




రాష్ట్రం ప్రకాశం జిల్లా గిద్దలూరు గ్రామానికి చెందిన వూస సుబ్బారావు తాండూర్, భీమిని, భీమారం, బెల్లంపల్లి-2 టౌన్, తాళ్లగురిజాల, నెన్నెల, చెన్నూర్ మండలాల్లో ఏజెంట్ల ద్వారా నకిలీ పత్తి విత్తనాలను విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. ఈ ఏడాదిలోనే అతనిపై రెండు కేసులు నమోదయ్యాయని, అక్రమంగా డబ్బు సంపాదించేందుకు నకిలీ విత్తనాల వ్యాపారాన్ని కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. తాండూర్ సీఐ దేవయ్య, ఎస్ఐ ప్రసాద్ నిందితుడికి పీడీ ఉత్తర్వులు అందజేసి చర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలించినట్లు తెలిపారు. 2021 నుంచి 2025 వరకు నకిలీ పత్తి విత్తనాల రవాణా, నిల్వ, విక్రయాలకు సంబంధించిన పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని, 2021లో కూడా అతనిపై పీడీ చట్టం అమలు చేసినప్పటికీ తన వైఖరిని మార్చుకోకుండా మళ్లీ నేరాలకు పాల్పడ్డాడని సీపీ వెల్లడించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్, కొమురంభీం-ఆసిఫాబాద్ జిల్లా పరిధిలో మొత్తం తొమ్మిది కేసుల్లో నిందితుడిగా ఉన్న వూస సుబ్బారావు అమాయక రైతులను అసలు విత్తనాల పేరుతో నకిలీ విత్తనాలు విక్రయించి మోసం చేస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నుంచి నకిలీ విత్తనాలను తీసుకువచ్చి రైతులను మోసం చేస్తున్నాడని, ఏడాది వ్యవధిలో రెండుసార్లు పట్టుబడినట్లు పేర్కొన్నారు. నకిలీ విత్తనాల తయారీ, నిల్వ, అక్రమ సరఫరా వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, అవసరమైతే పీడీ చట్టం సహా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ హెచ్చరించారు. నిందితుడిపై పీడీ చట్టం అమలుకు కృషి చేసిన బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్, తాండూర్ సీఐ దేవయ్య, ఎస్ఐ ప్రసాద్‌లను ఆయన అభినందించారు.

## ఎస్బీఐ భీమారం బ్రాంచ్‌లో నగదు కొరత: ఏటీఎంలు ఖాళీ, గంటల పాటు క్యూ లైన్లలో ఖాతాదారులు

అర్జున్ సమాచారం , (మంచిర్యాల జిల్లా ప్రతినిధి):జూన్ 18




ఎస్బీఐ భీమారం శాఖలో గత కొన్ని రోజులుగా తీవ్ర నగదు కొరత వేధిస్తోంది. బ్యాంకుకు వస్తున్న ఖాతాదారులకు నగదు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర ఖర్చులు, వైద్యం, వ్యాపార లావాదేవీల కోసం డబ్బులు డ్రా చేసుకునేందుకు వచ్చిన ప్రజలు గంటల తరబడి క్యూ లైన్లలో వేచి ఉండి డబ్బులు తీసుకునే సమయానికి బ్యాంక్ లో 10,000/- లేదా 20,000 రోజుకి ఇవ్వడం తో రైతులు తీవ్ర నిరాశకు గురి అవుతున్నారు. బ్యాంకు ఆవరణలోని ఏటీఎంలలో కూడా బ్యాంక్ సిబ్బంది ఏటిఎం లో నగదు పెట్టిన గంట వ్యవదిలోనే డబ్బులు అయిపోవడం తో ఖాతాదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డిజిటల్ లావాదేవీలు అందుబాటులో ఉన్నప్పటికీ, చేతిలో నగదు లేకపోవడంతో నిత్యావసరాలు కొనుగోలు చేయడానికి ఖాతాదారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెన్షన్ దారులు, రైతులు, చిన్న వ్యాపారులు ఈ నగదు కొరత వల్ల తీవ్రంగా నష్టపోతున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, భీమారం ఎస్బీఐ బ్రాంచ్‌కు తగినంత నగదును సమకూర్చాలని, ఏటీఎంలు నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## కాళేశ్వర ఆలయ అభివృద్ధి పేరుతో అవినీతికి కుట్ర: మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆరోపణ






పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 18

కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పేరుతో భారీ అవినీతికి పాల్పడే ప్రయత్నం జరుగుతోందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆరోపించారు. గురువారం మహాదేవ్‌పూర్ మండలం కాళేశ్వరంలో ఆలయ పరిసరాలను పరిశీలించిన అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వర ఆలయ పునర్నిర్మాణం పేరుతో సుమారు రూ.198 కోట్ల పనులు చేపడుతున్నట్లు ప్రకటించారని, ఇందులో భారీ స్థాయిలో అవినీతి జరిగే అవకాశముందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని ముఖ్యమంత్రే చెబుతున్న పరిస్థితుల్లో ఇంత పెద్ద మొత్తంలో నిధులు ఎలా సమకూరుస్తారో ప్రజలకు స్పష్టత ఇవ్వాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును డిమాండ్ చేశారువచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నేపథ్యంలో దేశవ్యాప్తంగా లక్షలాది మంది భక్తులు కాళేశ్వరానికి వస్తారని, అలాంటి సమయంలో ఆలయాన్ని కూల్చివేయడం వల్ల భక్తులకు ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఆలయ పునర్నిర్మాణానికి ముందు ప్రజాప్రతినిధులు, నిపుణులు, పురోహితులు, స్థానిక ప్రజలతో సమగ్ర చర్చలు జరపాల్సి ఉందని సూచించారు. భూపాలపల్లి జిల్లా కలెక్టర్ ఖాతాలో పనులకు సంబంధించిన నిధులు జమ చేసిన తర్వాత మాత్రమే పనులు ప్రారంభించాలని, లేకుంటే కూల్చివేతలను వ్యతిరేకిస్తామని హెచ్చరించారు. ఆలయాల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

## అనారోగ్యంతో ఉన్న ఆలయ సేవకుడిని పరామర్శించిన మాజీ సర్పంచ్

పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 18



పన్నూర్ మాజీ సర్పంచ్ అల్లం పద్మ తిరుపతి అనారోగ్యంతో బాధపడుతున్న పన్నూర్ శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ సేవకుడు ధర్మల భూమయ్యను గురువారం పరామర్శించారు. గత కొన్ని సంవత్సరాలుగా ఆలయంలో సేవలందిస్తున్న ధర్మల భూమయ్య ప్రస్తుతం కిడ్నీ సంబంధిత అనారోగ్యంతో డయాలసిస్ చికిత్స పొందుతూ ఉండటంతో, రత్నాపూర్‌లోని ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొంత ఆర్థిక సహాయం అందజేసి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ధర్మల భూమయ్య త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, అవసరమైన సహాయం అందించేందుకు తన వంతు సహకారం ఉంటుందని మాజీ సర్పంచ్ అల్లం పద్మ తిరుపతి తెలిపారు.

PRGI NO: TGTEL/25/A5514
అర్జున్ సమాచారం
www.arjunsamaachaaram.in
తెలుగు దినపత్రిక
సినిమా
CINEMA



# 'మైసా'లో నక్సలైట్‌గా?

అగ్ర కథానాయిక రష్మిక మందన్న నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'మైసా' నిర్మాణం నుంచే ప్రేక్షకుల్లో ఆసక్తినిరేకెత్తిస్తున్నది. ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాల్లో రష్మిక ఫెరోషియస్ లుక్స్‌తో సర్‌ప్రైజ్ చేసింది. ఈ సినిమాలో ఆమె గోండు తెగకు చెందిన గిరిజన మహిళ పాత్రను పోషిస్తున్నది. కెరీర్‌లో తొలిసారి ఫుల్‌లెంగ్త్ యాక్షన్ రోల్‌చేస్తుండటంతో ఈ సినిమా విషయంలో రష్మిక మందన్న ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నదితాజా సమాచారం ప్రకారం ఈ చిత్రంలో ఆమె నక్సలైట్ పాత్రలో కనిపించనుందని తెలిసింది. వ్యవస్థపై ధిక్కార స్వరం వినిపించే ధీరోదాత్తురాలైన గిరిజన మహిళగా ఆమె పాత్ర అత్యంత శక్తివంతంగా సాగుతుందని చెబుతున్నారు. అయితే ఆమె పాత్ర తాలూకు అసలైన వివరాలు తెలియాలంటే చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే. రవీంద్ర పుల్లె దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. పాన్ ఇండియా రిలీజ్ కానుంది.



# లంకా దహనం సీత చేస్తే..



అలియాభట్, శార్వరి వాఘ్ ప్రధాన పాత్రల్లో నటించిన ఫిమేల్ ఓరియెంటెడ్ స్పైథ్రిల్లర్ 'ఆల్ఫా' సినిమా ట్రైలర్‌ను బుధవారం విడుదల చేశారు. యశ్‌రాజ్ ఫిల్మ్ స్పై యూనివర్స్‌లో భాగంగా ఈ సినిమా రానుంది. ఇందులో అలియాభట్ గూఢచారి పాత్రలో కనిపించనుంది. దేశానికి వ్యతిరేకంగా 'ఆల్ఫా' పేరుతో ప్రతినాయకుడు నడిపే మిషన్‌ను అడ్డుకోవడమే లక్ష్యంగా అలియాభట్ బృందం చేసిన సాహసాలు ఏమిటన్నదే ఈ సినిమా ఇతివృత్తం. హై ఇంటెన్సిటీ యాక్షన్‌తో ట్రైలర్ ఆద్యంతం థ్రిల్‌ని పంచింది. బాబీడియోల్ క్రూరుడైన విలన్ పాత్రలో కనిపించాడు. 'సీత లంకాదహనం చేస్తే ఎలా ఉంటుందో చూడాలనుకుంటున్నారా' అంటూ అలియాభట్ చెప్పిన డైలాగ్ ట్రైలర్‌లో హైలైట్‌గా నిలిచింది. ఆదిత్యచోప్రా నిర్మాణంలో శివ్ రవాలీ దర్శకత్వం వహించిన ఈ సినిమా జూలై 3న ప్రేక్షకుల ముందుకురానుంది.

# 'కామ్రేడ్ కల్యాణ్' ప్రేమాయణం

వినోదప్రధానంగా సినిమాలు చేస్తూ వినూత్న కథలతో ప్రేక్షకుల్ని అలరిస్తున్నారు హీరో శ్రీవిష్ణు. ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'కామ్రేడ్ కల్యాణ్'. జానకీరామ్ మారెళ్ల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని వెంకటకృష్ణ కర్నాటి, సీతా కర్నాటి నిర్మిస్తున్నారు. ఈ సినిమా తొలిపాటను ఈ నెల 20న విడుదల చేయబోతున్నారు. ఈ సందర్భంగా అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. యాక్షన్, వినోదం ప్రధానంగా నడిచే ప్రేమకథా చిత్రమిదని, నేటికి ట్రెండ్‌కి తగినట్లుగా ఉంటూ యువతను ఆకట్టుకుంటుందని మేకర్స్ తెలిపారు. మహిమా నంబియార్, రాధిక శరత్‌కుమార్, షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లిమాయే తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: విజయ్ బుల్గానిన్, సమర్పణ: కోన వెంకట్ దర్శకత్వం: జానకీరామ్ మారెళ్ల.



# యాంకర్‌ని చూసి రాసుకున్న కథ!

'దీవాన' చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయమవుతున్నాడు శ్రీకాంత్ సంగిశెట్టి. హర్షిత్ రెడ్డి హీరోగా వాసుదేవ్ కొప్పినేని, శ్రీదేవి కార్యంపూడి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 19న గీతా ఫిల్మ్ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా బుధవారం శ్రీకాంత్ సంగిశెట్టి విలేకరులతో ముచ్చటించారు. వన్‌సైడ్ లవ్‌స్టోరీగా తెరకెక్కించిన ఈ సినిమాలో హృదయాన్ని కట్టిపడేసే భావోద్వేగాలు ఉంటాయని, ఇందులో తల్లిదండ్రుల తాలూకు ప్రేమ గురించి కూడా చూపించామన్నారు. 'పదేళ్లక్రితం వచ్చిన 'మిణుగురులు' చిత్రానికి సహాయ దర్శకుడిగా పనిచేశా.ఆ తర్వాత ఓ కార్పొరేట్ కంపెనీలో ఉద్యోగం చేశాను. అదే సమయంలో డెమో ఫిల్మ్స్, షార్ట్‌ఫిల్మ్, సాంగ్ వీడియోలు చేసేవాడిని. ఎంబీఏ చేస్తున్న రోజుల్లో జెమిని టీవీ యాంకర్‌ని చూసి 'దీవాన' కథ రాసుకున్నా. ఆమె రోజూ టీవీలో కనిపించేది. ఇలాంటి అమ్మాయిని ఓ అపరిచితుడు వెళ్లి కలిస్తే ఎలా ఉంటుంది? అనే ఆలోచన నుంచే ఈ కథ పుట్టింది.



# మల్టీస్టారర్‌కు వెరైటీ టైటిల్?

ఈ ఏడాది 'మనశంకర వరప్రసాద్‌గారు' చిత్రంతో సంక్రాంతి బరిలో బ్లాక్‌బస్టర్ హిట్ కొట్టారు దర్శకుడు అనిల్ రావిపూడి. ఈ నేపథ్యంలో వెంకటేష్, కల్యాణ్‌రామ్‌లతో ఆయన తెరకెక్కించబోతున్న భారీ మల్టీస్టారర్‌పై ఇప్పటికే అంచనాలు పెరిగాయి. ఈ సినిమా నేడు లాంఛనంగా ప్రారంభంకానుంది. షైన్‌స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి నిర్మిస్తున్నారు. నవంబర్‌లోగా చిత్రాన్ని పూర్తి చేసి తనకు బాగా కలిసొచ్చిన సంక్రాంతి సీజన్‌లోనే ఈ సినిమాను రిలీజ్ చేసేందుకు సిద్ధమవుతున్నారు అనిల్ రావిపూడి. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాకు 'జనవరి 13 విడుదల' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు తెలిసింది. సినిమా అనౌన్స్‌మెంట్ మొదలు ప్రచార కార్యక్రమాల వరకు ప్రతీ విషయంలో వినూత్నంగా ఆలోచించే అనిల్ రావిపూడి ఈ సినిమా టైటిల్ కూడా వెరైటీగా ఉండాలని నిర్ణయించుకున్నారట.





# కథలో కొత్తదనానికే ప్రాధాన్యం

'ప్రస్తుతం ప్రేక్షకుల అభిరుచుల్లో చాలా మార్పులొచ్చాయి. కేవలం ఫ్యామిలీ ఎంటర్‌టైనర్స్, లవ్‌స్టోరీస్‌తో వారిని థియేటర్లకు రప్పించలేం. కొత్త కంటెంట్‌కు చాలా ప్రాధాన్యతనిస్తున్నారు. ఈ సినిమాను కూడా యూనిక్ పాయింట్‌తో తెరకెక్కించాం' అన్నారు కథానాయకుడు వడ్డే నవీన్. దాదాపు పదేళ్ల విరామం తర్వాత ఆయన ఇండస్ట్రీలోకి పునరాగమనం చేస్తూ స్వీయ నిర్మాణంలో నటించిన చిత్రం 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు'. కమల్‌తేజ నార్ల దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రం ఈ నెల 19న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా బుధవారం వడ్డే నవీన్ పాత్రికేయులతో సినిమా విశేషాల్ని పంచుకున్నారు.నా మనసుకు నచ్చిన కథలు దొరకని కారణంగానే ఇన్నేళ్లు సినిమాలకు గ్యాప్ తీసుకున్నా. 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు'లోని పాయింట్ చాలా కొత్తగా ఉంటుంది. వృత్తిలో నిజాయతీగా ఉండే కానిస్టేబుల్ త్రిమూర్తులు 55 సార్లు ట్రాన్స్‌ఫర్ అవుతాడు. ఈ నేపథ్యంలో అతను వ్యవస్థతో చేసిన పోరాటం ఏమిటన్నదే ఈ సినిమాలో ఆసక్తికరమైన అంశం.



# మంథని గర్ల్స్ హైస్కూల్‌లో నూతన ప్రవేశాల వెల్లువ

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 18**

మంథని బాలికల ఉన్నత పాఠశాలలో నూతన విద్యార్థుల చేరికలు జోరుగా కొనసాగుతున్నాయి. పాఠశాలలు ప్రారంభమైన మూడు రోజుల్లోనే 25 మంది విద్యార్థినులు కొత్తగా ప్రవేశం పొందగా, వారిలో 13 మంది ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలలో చేరారు. నూతనంగా చేరిన విద్యార్థినులకు ప్రధానోపాధ్యాయురాలు సుదాడి సుమలతతో పాటు ఉపాధ్యాయులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు సుదాడి సుమలత మాట్లాడుతూ, గత విద్యా సంవత్సరంలో పదో తరగతి ఫలితాల్లో మండలంలో అత్యధిక మార్కులు సాధించడం, బాసర ఐఐఐటీలో విద్యార్థి వి. విక్రాంత్‌కు సీటు రావడం, మేధా స్కాలర్‌షిప్ ద్వారా ఆరు సంవత్సరాల ఉచిత విద్యా పథకానికి ఎన్. పరమేష్ ఎంపిక కావడం, నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)కు పూసాల సుశ్రుత ఎంపిక కావడం, జిల్లాస్థాయి రోబోటిక్స్ పోటీల్లో ఎనిమిదో తరగతి విద్యార్థి బి. టాగూర్ ప్రతిభ కనబరచడం వంటి విజయాలు పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకువచ్చాయని తెలిపారు. గత ఏడాది రూ. 68 లక్షల వ్యయంతో సీడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఇంటర్నెట్



ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) ల్యాబ్, ఆధునిక స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు, లైబ్రరీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ల్యాబ్ ద్వారా విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్ వంటి ఆధునిక సాంకేతిక విద్యను అందిస్తున్నామని, ప్రతి తరగతి గదిలో ఇంటరాక్టివ్ ప్యానెల్ బోర్డుల ద్వారా డిజిటల్ బోధన నిర్వహిస్తున్నామని చెప్పారు. క్రమశిక్షణ, నైతిక విలువలతో కూడిన విద్యతో పాటు స్వేచ్ఛాయుత వాతావరణంలో బోధన అందిస్తున్నామని, ఉచిత మధ్యాహ్న భోజనం, రాగి జావ, యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ వంటి సౌకర్యాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు అందుబాటులో ఉండటంతో ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోకి చేరికలు పెరుగుతున్నాయని తెలిపారు. తల్లిదండ్రులు అధిక ఫీజులు చెల్లిస్తూ ప్రైవేట్ పాఠశాలలకు పంపడం కంటే ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దాలని ఆమె పిలుపునిచ్చారు.

## అటవీ సరిహద్దుల పరిరక్షణకు సహకరించండి

**అర్జున్ సమాచారం జూన్ 18 మంచిర్యాల:ప్రతిని.**

మంచిర్యాల, జైపూర్, బీమారం, మందమర్రి మండలాల జేసీబీ యజమానులు, ట్రాక్టర్ యజమానులకు మంచిర్యాల అటవీ శాఖ రేంజ్ అధికారి విజ్ఞప్తి.అటవీ ప్రాంతాలను ఆనుకొని ఉన్న భూములను దున్నే సమయంలో అటవీ సరిహద్దు గుర్తులు, కందకాలు తొలగించడం చట్టవిరుద్ధమైన చర్య. అటవీ భూముల హద్దులను చెరిపివేయడం, కందకాలను పూడ్చివేయడం నేరంగా పరిగణించబడుతుంది.సరిహద్దు ప్రాంతాల్లో వ్యవసాయ పనులు చేపట్టే సమయంలో ట్రాక్టర్, జేసీబీ యజమానులు అత్యంత అప్రమత్తంగా ఉండాలి. అటవీ సరిహద్దు గుర్తులు గానీ, కందకాలు గానీ ధ్వంసమైనట్లు గుర్తించిన పక్షంలో సంబంధిత వాహనాలను స్వాధీనం చేసుకునే చర్యలు చేపట్టబడతాయి.కావున అటవీ సంపద పరిరక్షణలో భాగస్వాములు కావాలని, సరిహద్దు ప్రాంతాల్లో పనులు నిర్వహించే సమయంలో పూర్తి జాగ్రత్తలు పాటించాలని కోరడమైనది.

## మీసేవ కేంద్రాల్లో నో రిసిప్ట్

### ఇకపై ఎస్ఎంఎస్ రూపంలో డిజిటల్ రసీదు

**అర్జున్ సమాచారం, మంచిర్యాల జిల్లా ప్రతి నిధి :**




రాష్ట్రంలోని మీసేవ కేంద్రాల్లో దరఖాస్తుదారులకు అందజేస్తున్న భౌతిక రసీదు ప్రక్రియను పూర్తిగా నిలిపివేయనున్నారు. డిజిటల్ సేవలను ప్రోత్సహించడంలో భాగంగా ఈ నెల 19 నుంచి కాగితపు రసీదు జారీని నిలిపివేయాలని మీసేవల కమిషనర్ అన్ని కేంద్రాల నిర్వాహకులకు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.దానిలో భాగం గా ఈ నెల 19 నుండి మీసేవల అప్లికేషన్ లకు ఎలాంటి రిసిప్ట్ ఇవ్వడం ఉండదని , అంతా డిజిటల్ రూపం లో వారి ఫోన్ కు మెసేజ్ వస్తుందని తెలిపారు.ఈ నేపథ్యంలో దరఖాస్తు సమయంలో సరైన ఫోన్ నంబర్‌ను నమోదు చేయాలని అధికారులు సూచించారు. ఒకవేళ మెసేజ్ పొరపాటున డిలీట్ అయితే మీసేవ ద్వారా మళ్లీ పంపించే అవకాశాన్ని కల్పించారు.

## నేడు కాంగ్రెస్ బీఎల్‌ఏల ముఖ్య సమావేశం

### రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**అర్జున్ సమాచారం జూన్ 18 మంచిర్యాల:ప్రతినిది.**



తాండూర్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం రోజున రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు, అనంతరం బీఎల్‌ఏల ముఖ్య సమావేశం నిర్వహించనున్నట్లు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెద్దబోయిన శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. మాదారం రోడ్‌లోని సురభి ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10:00 గంటలకు ఈ సమావేశం జరుగుతుందని తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా మంచిర్యాల జిల్లా డీసీ అధ్యక్షుడు రఘునాథరెడ్డి హాజరవుతున్నారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ పార్టీ బీఎల్‌ఏలు, సర్పంచులు, ఉప సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని పీసీసీ అధ్యక్షుడికి వినతి

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 18**



నాయి బ్రాహ్మణ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ నాయి బ్రాహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొల్లపల్లి రాజమల్లు గురువారం పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలోని నాయి బ్రాహ్మణుల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలను అమలు చేయాలని వినతిపత్రంలో కోరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ సమస్యను పరిశీలించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చినట్లు రాజమల్లు వెల్లడించారు. నాయి బ్రాహ్మణుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

## పలు శుభకార్యాలలో పాల్గొన్న రత్నాపూర్ సర్పంచ్

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 18**



రత్నాపూర్ గ్రామ సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు గురువారం గ్రామంలో నిర్వహించిన పలు శుభకార్యాలలో పాల్గొన్నారు. రత్నాపూర్‌కు చెందిన కెక్కర్ల సారయ్య--రజిత దంపతుల కుమార్తె వివాహ వేడుకతో పాటు రాంనగర్‌కు చెందిన బత్తిని శ్రీనివాస్--భాగ్యలక్ష్మి దంపతుల నూతన గృహప్రవేశ కార్యక్రమానికి హాజరై కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమాల్లో పూజారి సౌమిత్రి కృష్ణమాచార్యులు, వార్డు సభ్యుడు పున్నం మణితేజ, స్థానిక నాయకులు సందేవేణ కుమార్, పబ్బ మొగిలి, సోమారపు కనకయ్య, జంగేటి కుమార్, పబ్బ వెంకటేష్, కెక్కర్ల రమేష్, బండారి లింగయ్య, ఇజ్జగిరి సంపత్, ముడుసు నరసయ్య, బెజ్జాల శంకర్, చెలుకల ఆదిత్య, దాసరి మల్లి తదితరులు పాల్గొన్నారు.

## రైతులను కేంద్రం పట్టించుకోవడం లేదు: ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 18**

రాష్ట్ర రైతుల అవసరాలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే యూరియా ఎరువులను ముందుగా తెలంగాణ రైతులకే అందించాలని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని సీఎల్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న యూరియాను మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాలకు తరలించడం వల్ల



తెలంగాణలో ఎరువుల కొరత ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఏప్రిల్, మే నెలలకు సంబంధించిన 47 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఇంకా రాష్ట్రానికి రావాల్సి ఉందని, ఈ విషయంలో కేంద్రంలోని తెలంగాణ మంత్రులు స్పందించలేదని విమర్శించారు.రైతు గోస పేరుతో యాత్రలు చేసిన బీజేపీ నాయకులకు రైతులకు యూరియా అందించాలనే ఆలోచన లేదన్నారు. రాష్ట్రానికి ఎనిమిది మంది ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నప్పటికీ రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయలేదని ఆరోపించారు.గతంలో సన్నవడ్లకు బోనస్ ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు బోనస్ అమలు చేసిందన్నారు. ఇటీవల రూ. 2 వేల కోట్ల బోనస్ రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో 75 లక్షల మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు పూర్తిచేయడంతో పాటు మార్క్‌ఫెడ్ ద్వారా 15 లక్షల మెట్రిక్ టన్నుల మక్కలను కూడా సేకరించామని చెప్పారు. కొనుగోళ్లలో ప్రభుత్వానికి నష్టం వచ్చినప్పటికీ రైతుల ప్రయోజనాల కోసం భరించామని పేర్కొన్నారు.వచ్చే పంట కాలంలో కూడా సన్నవడ్లకు బోనస్ కొనసాగుతుందని స్పష్టం చేశారు. వరి సాగు చేయొద్దని ప్రభుత్వం ఎప్పుడూ చెప్పలేదని, పంటల మార్పిడి ద్వారా భూసారం పెరుగుతుందని, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పామాయిల్ సాగును ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్, హరీష్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడానికే పరిమితమయ్యారని, ప్రజా సమస్యల కంటే రాజకీయ విమర్శలపైనే ఎక్కువ దృష్టి పెడుతున్నారని చింతకుంట విజయరమణారావు విమర్శించారు.

## మాదిగ కుల సంఘం అధ్యక్షుడిగా దామెర దేవయ్య ఏకగ్రీవ ఎన్నిక

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 18**



కమాన్‌పూర్ మండలం గుండారం గ్రామ మాదిగ కుల సంఘం అధ్యక్షుడిగా దామెర దేవయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలోని మాదిగ కులస్తులు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో దామెర లింగయ్య, అవునూరి మొండయ్య దామెర దేవయ్య పేరును అధ్యక్ష పదవికి ప్రతిపాదించగా, కుల సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించి ఆయనను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా దామెర దేవయ్య మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన కుల బాంధవులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సంఘ అభివృద్ధికి కృషి చేయడంతో పాటు కులస్తులకు ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి తన వంతు ప్రయత్నం చేస్తానని పేర్కొన్నారు.

### చికిత్స కోసం రూ. 2.50 లక్షల ఎల్ఓసీ అందజేత

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 18**

మంథని మండలం నాగేపల్లి గ్రామానికి చెందిన జంజర్ల సునంద వైద్య చికిత్స కోసం రూ. 2.50 లక్షల లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓసీ)ను తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరు చేయించారు.ప్రస్తుతం జంజర్ల సునంద హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, వైద్య ఖర్చుల నిమిత్తం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దృష్టికి విషయం తీసుకెళ్లారు. దీనిపై వెంటనే స్పందించిన మంత్రి సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ. 2,50,000 విలువైన ఎల్ఓసీ మంజూరు చేయించారు.



అనంతరం మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆసుపత్రి సహాయకులు బాధిత కుటుంబ సభ్యులకు ఎల్ఓసీని అందజేశారు.ఈ సందర్భంగా వైద్య సహాయం అందించి తమ కుటుంబానికి అండగా నిలిచిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు జంజర్ల సునంద కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రతి చిన్నారిని అంగన్వాడిలో చేర్పించాలి: నాగారం సర్పంచ్ పోనగంటి కుమార్



**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 18**

ప్రతి చిన్నారిని అంగన్వాడి కేంద్రాల్లో చేర్పించి ప్రభుత్వ సంక్షేమ సేవలను సద్వినియోగం చేసుకోవాలని నాగారం గ్రామ సర్పంచ్ పోనగంటి కుమార్, ఉప సర్పంచ్ ఉడ్నాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు.కమాన్‌పూర్ మండలంలోని నాగారం గ్రామపంచాయతీ పరిధిలోని లింగాల అంగన్వాడి కేంద్రంలో గురువారం చిన్నారులకు ప్రభుత్వం అందజేసిన యూనిఫారాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అంగన్వాడి కేంద్రాల అభివృద్ధి కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తోందని తెలిపారు.చిన్నారులకు పోషకాహారంతో కూడిన బలవర్ధక ఆహారాన్ని అందించడంతో పాటు గర్భిణీలు, బాలింతలకు కూడా ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తూ వారి ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ సేవలను ప్రతి కుటుంబం వినియోగించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్త అమలతో పాటు ఇతరులు పాల్గొన్నారు.

## మంత్రిని, ప్రభుత్వ విప్‌ను కలిసిన మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు జడల సురేందర్

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 18**

పెద్దపల్లి జిల్లా మున్నూరు కాపు సంఘం నూతన జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన జడల సురేందర్ గురువారం హైదరాబాద్ సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావును మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా మంత్రి, ప్రభుత్వ విప్ జడల సురేందర్‌ను శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం జడల సురేందర్ మాట్లాడుతూ, పెద్దపల్లి జిల్లా కేంద్రంలో మున్నూరు కాపు సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని, అలాగే సంఘానికి సంబంధించిన పలు సమస్యలను మంత్రి, ప్రభుత్వ విప్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.దీనిపై స్పందించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు మున్నూరు కాపు సంఘ బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి



చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అలాగే నూతనంగా ఎన్నికైన జడల సురేందర్, ఆయన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో సంఘ అభివృద్ధి, ప్రజాసేవలో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘ నాయకులు లువాక రాజయ్య, అమీర్‌శెట్టి రామస్వామి, ఆకుల కిరణ్, పుప్పాల దేవేందర్, ఆకుల స్వామి, వివేక్ పటేల్, మాదాసు సందీప్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by LINGAM RAJAIAH, and Printed at Vijaya Lakshmi Printing Press , H.No.12-180, Gouthaminagar,Mancheria, Mancherial Telangana-504208, and Published at H.No.12-180, Gouthami-nagar,Mancheria,Mancherial Telangana-504208. Editor: LINGAM RAJAIAH. PRGI. No. TGTEL/25/A5314, lingamrajaiahmncl@gmail.com,8121319896.